మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం WEDNESDAY 24-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు:12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 2 Volume:2 || సంచిక: 86 Issue: 86

24 సెప్టెంబర్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:08 సూర్యాస్తమయం - సా. 6:07 తిథి త్రయోదశి రా. 11:14 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ధనిష్ఠ ఉ. 10:23 వరకు తరువాత శతభిష యోగం ధృతి మ. 3:47 వరకు కరణం కౌలవ ఉ. 11:06 వరకు తైతుల రా. 11:14 వరకు వర్జ్యం సా. 6:01 నుండి రా. 7:40 వరకు దుర్ముహూర్తం ఉ. 10:08 నుండి ఉ. 10:56 వరకు మ. 2:55 నుండి మ. 3:43 వరకు రాహుకాలం మ. 1:37 నుండి మ. 3:07 వరకు యమగండం ఉ. 6:08 నుండి ఉ. 7:38 వరకు గుళికాకాలం ఉ. 9:08 నుండి ఉ. 10:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:32 నుండి తె. 5:20 వరకు అమృత ఘడియలు తె. 3:55 నుండి తె. 5:34 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:44 నుండి మ. 12:32 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

## వచ్చే ఆదివారం బ్యాంకులకు వర్కింగ్ డే




న్యూఢిల్లీ: ఈ నెల 28 నుంచి 30 వరకు దేశవ్యాప్త బ్యాంక్ ఉద్యోగుల సమ్మె కారణంగా ఈ నెల 27న, ఆదివారం ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు అదనంగా పని చేస్తాయని కేంద్ర ఆర్థిక శాఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. రెండు రోజుల వారాంతపు సెలవుల(ఈ నెల 26, 27) తర్వాత సమ్మె మొదలు కానున్న నేపథ్యంలో వినియోగదారులకు సేవల్లో సుదీర్ఘ కాలం అంతరాయం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. ఈ నెల 27న బ్యాంకులు, బ్యాంకింగ్ ఆఫీసులు, ఏటీఎంతో కూడిన శాఖలు, కరెన్సీ చెస్ట్‌లు(పెట్టెలు) పనిచేసేందుకు ఆర్బీఐ కూడా ఆమోదం తెలిపింది.

## 25న నిమజ్జనం సెలవు



హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): వినాయక నిమజ్జనం సందర్భంగా ఈనెల 25న తెలంగాణ ప్రభుత్వం సెలవు దినాన్ని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం వినాయన నిమజ్జనం పురస్కరించుకుని హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాల యాలు, -2 వ పేజీలో...

## తగ్గనున్న వంటనూనెల ధరలు



న్యూఢిల్లీ: రాబోయే దసరా, దీపావళి పండుగల వేళ ప్రజలపై పడుతున్న నిత్యావసరాల భారానికి చెక్ పెడుతూ కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై దిగుమతి సుంకాలను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. గత ఏడాది కాలంగా దేశంలో వంట నూనెల ధరలు దాదాపు 20 శాతం పెరగడం, పండుగల సమయంలో స్వీట్లు, పిండివంటల తయారీతో డిమాండ్ భారీగా పెరుగుతుండటంతో ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం నుండి అమల్లోకి వచ్చేలా పన్ను కోత తరువాయి 2 వ పేజీలో...

# బన్సాల్ పాచికలు

## తెలంగాణపై కమలం పార్టీ గురి

## అధికారమే టార్గెట్‌గా పావులు

## ఇంచార్జిగా సునీల్ బన్సాల్ నియామకం

## బెంగాల్ స్ఫూర్తితో టీజీలో అడుగులు

## పార్టీని బలోపేతానికి భారీ ప్రక్షాళన



ఆయన అడుగు పెడితే ప్రత్యర్థి వ్యూహాలు పటాపంచలు..
ఆయన వ్యూహం పన్నితే ప్రత్యర్థికి పట్టపగలే చుక్కలు..
గెలుపు ఎలా ఉంటుందంటే.. ఇది కదా గెలుపు అన్నట్లు ఉంటుంది.
ఉత్తరప్రదేశ్ అయితేనేం..? ఒడిశా అయితేనేం..? బెంగాల్ అయితేనేం..?
ప్రతికూల వాతావరణాన్ని అనుకూలంగా మార్చగల ధిట్ట..
ఇప్పుడు తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేసేందుకు వస్తున్నాడు
ఆయనే.. సునీల్ బన్సాల్.

భిన్నమైన రాజకీయ పరిస్థితుల్లో పార్టీ సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేయడం, బూత్ స్థాయి వరకు కార్యకర్తల నిర్మాణం, స్థానిక సమస్యలపై దృష్టి, సమాచార ఆధారిత సూక్ష్మ నిర్వహణ వంటి అంశాలతో సునీల్ బన్సాల్ తనదైన పని తరువాయి 2 వ పేజీలో...

# దసరాకు 2 డీఏలు

## మిగతా నాలుగు పెండింగ్... పది రోజుల్లో పీఆర్సీ నివేదిక

## ఉద్యోగులకు సర్కారు హామీ.. సీపీఎస్‌పై కమిటీ ఏర్పాటు




రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లకు సర్కారు సానుకూలంగా స్పందించింది. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏల్లో 2 డీఏలను ఒకేసారి ఇచ్చేందుకు సమ్మతిస్తూ, దసరాకు ఆ డీఏలను విడుదల చేస్తామని తెలిపింది. ఇక పీఆర్సీ నివేదికను పది రోజుల్లో తీసుకుంటామని ఉద్యోగులకు హామీ ఇచ్చింది. అటు.. సీపీఎస్‌పైనా కమిటీ ఏర్పాటు చేసింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): పెండింగ్ బిల్లుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉద్యోగ సంఘాలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ సూచన మేరకు రెండు రోజులుగా వాయిదా పడిన ఉద్యోగ సంఘాల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం సచివాలయంలో బుధవారం జరిగింది. 5 డీఏల్లో కనీసం మూడు ఇవ్వాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. అయితే రెండు డీఏలు ఇవ్వాలని కేబినెట్‌కు సిఫార్సు చేస్తామని సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. దసరా నాటికి ఒకటి, ఉగాది వరకు మరో డీఏ ఇచ్చేలా ప్రతిపాదిస్తామని సీఎస్ చెప్పారు. సీఎస్ ప్రతిపాదనకు ఉద్యోగులు ఒప్పుకోకపోవడంతో చర్చలు విఫమయ్యాయి. మరోసారి ఉపముఖ్యమంత్రి సమక్షంలో ఉద్యోగ సంఘం నేతలతో సీఎస్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రెండు డీఏలను దసరాకు ఒకేసారి చెల్లించేందుకు ఒప్పుకున్నారు.



# లడ్డూకు 1.01 కోట్లు!

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కీర్తి రిచ్‌మండ్ గేటెడ్ కమ్యూనిటీ విల్లాస్‌లోని వినాయక మండపంలో గణనాథుడి లడ్డూ వేలం మరోసారి రికార్డు సృష్టించింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిర్వహించిన లడ్డూ వేలంలో అదే కమ్యూనిటీకి చెందిన శక్తిమాన్ బృంద సభ్యులు రూ.1.01 కోట్లకు కైవసం చేసుకున్నారు. 2016లో మొదటిసారి లడ్డూ వేలం మొదలైంది. అనంతరం నాలుగేళ్లుగా ఇక్కడి కమ్యూనిటీకి సంబంధించి తెలుగు రాష్ట్రాల్లోనే రికార్డుస్థాయిలో లడ్డూ వేలం కొనసాగగా.. ఈ ఏడాది అదే పరంపరను అనుసరించారు. గత ఏడాది ఈ కమ్యూనిటీలోని లడ్డూ రూ.2.31 కోట్లు పలికింది. ప్రతి సంవత్సరం కమ్యూనిటీకి చెందిన వారంతా నాలుగు గ్రూపులుగా విడిపోయి వేలం పాటలో పాల్గొంటున్నారు. లడ్డూ వేలం పాట ముగిసిన అనంతరం గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. కమ్యూనిటీ వాసులు పాల్గొన్నారు.

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,824 |
| వెండి (కిలో): | రూ.2,,60,600 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,590 |




# జూరాల.. జోరుగా పంటల్లోకి!

## కర్ణాటక నుంచి కృష్ణా జలాలు రిలీజ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాల మధ్య కృష్ణా జలాల విడుదలపై జరిగిన చర్చలు సఫలమయ్యాయి. తెలంగాణకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ అంగీకరించారు. ఇవాళ ఉదయం తెలంగాణకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల బృందం కర్ణాటక సీఎంతో భేటీ అయి.. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై డీకే శివ కుమార్ సానుకూలంగా స్పందించి, అవసరమైన ఏర్పాట్లు చేయాలని తరువాయి 2 వ పేజీలో...



# సెక్రటేరియట్‌లో ఇంటర్నెట్ బంద్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. దీంతో పలు శాఖల్లో పౌర సేవలు, ప్రభుత్వ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎక్కడి ఫైళ్లు అక్కడే ఆగిపోయాయి. మీడియా సెంటర్, పబ్లిసిటీ సెల్, ఎన్ఆర్ఐ అసిస్టెన్సీ సెల్‌లోనూ ఇంటర్నెట్ పనిచేయలేదు. ఇంటర్నెట్ సేవలు ఒక్కసారిగా నిలిచిపోవడంతో అధికార యంత్రాంగంతో పాటు విజిటర్స్ కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఇంటర్నెట్ తరువాయి 2 వ పేజీలో...

# మీ ఇంటికే.. 'మీ సేవ'

## డోర్ డెలివరీ ప్రారంభం




హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): తెలంగాణ ప్రజలకు ప్రభుత్వ పౌర సేవలను మరింత సులభంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై కొన్ని ముఖ్యమైన మీసేవ సర్వీసుల కోసం ప్రజలు కేంద్రాల వద్దకు వెళ్లి గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా.. ఇంటి వద్దకే మీసేవ సేవలను పొందే అవకాశం కల్పించారు. 'మీసేవ డోర్ డెలివరీ సర్వీసెస్'ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ విధానం ద్వారా పౌరులు తమకు అవసరమైన సేవలను ఇంటి నుంచే బుక్ చేసుకోవచ్చు. ఇందుకోసం 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడం, అధికారిక మీసేవ పోర్టల్ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసే మైటోకాండ్రియాలోని ఓ నిర్దిష్ట ప్రోటీన్ స్థాయిని పెంచడం ద్వారా ఎలుకల్లో వృద్ధాప్య లక్షణాలను నెమ్మదింపజేసి, ఆయుష్షును పెంచవచ్చని శాస్త్రవేత్తలు గుర్తించారు. వయసు పెరిగేకొద్దీ మైటోకాండ్రియా పనితీరు తగ్గి కణాలపై ఒత్తిడి, కణజాల నష్టం పెరుగుతుంటుంది. ఈ పరిశోధనలో కీలకమైన ప్రోటీన్ స్థాయిని పెంచగా మైటోకాండ్రియా మరింత సమర్థంగా శక్తిని ఉత్పత్తి చేసినట్లు గుర్తించారు. దీంతో కణాల్లో హానికరమైన ఒత్తిడి సంకేతాలు తగ్గి, పలు అవయవాల పనితీరు మెరుగ్గా కొనసాగింది. మైటోకాండ్రియా ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ద్వారా వృద్ధాప్య ప్రక్రియను ప్రభావితం చేయవచ్చనే ఆధారాలను ఈ అధ్యయనం బలపరుస్తోంది. అయితే ఈ ఫలితాలు ప్రస్తుతం ఎలుకలపై చేసిన పరిశోధనకే పరిమితం. మనుషుల్లో ఇదే ప్రభావం ఉంటుందని నిర్ధారించడానికి మరిన్ని అధ్యయనాలు అవసరం.



# ఆగమాగం చేస్తే తాటతీస్తాం

## గణేశ్ నిమజ్జనం వేళ సజ్జనార్ వార్నింగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం, శోభాయాత్రకు పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. ఈనెల 25వ తేదీన నగరంలో వేలాది గణేశ్ విగ్రహాల నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ తరువాయి 2 వ పేజీలో...

# రేవంత్ సర్కారు దద్దమ్మ

## రైతులకు నీళ్లివ్వడానికి చేతనైతలేదు.. తెలంగాణ రైతులకు క్రాప్ హాలీడే

## పాలమూరు పని పూర్తయ్యేదెప్పుడు?.. కడిగి పారేసిన మాజీమంత్రి హరీశ



రాష్ట్రంలో కాలం తెచ్చిన కరువు కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. దేశంలో ఎక్కడా క్రాప్ హాలిడే లేదని, తెలంగాణలో మాత్రమే క్రాప్ హాలిడే కొనసాగుతోందని అన్నారు. నీళ్లు లేక కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాక రైతాంగం కన్నీళ్లు పెడుతోందని ఆరోపించారు.

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): బుధవారం కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా బీఆర్ఎస్ భవన్‌లో మీడియాతో హరీశ్ రావు మాట్లాడారు. కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు నీళ్లు ఇవ్వడం చేతకాని ప్రభుత్వం అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. శ్రీశైలం నుంచి కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 4 వేలతరువాయి 2 వ పేజీలో...

# అంతా థర్డ్ గ్రేడ్

## జెన్‌కోకు నాసిరకం బొగ్గు

## రూ. 2,900 కోట్ల ప్రజాధనం వృథా

## సింగరేణికి ప్రభుత్వ బాకీ 52 వేల కోట్లు

## అందుకే థర్డ్ గ్రేడ్ బొగ్గు సరఫరా : కేటీఆర్



యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌తో ఇతర కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. జెన్‌కోకు థర్డ్ గ్రేడ్ కోల్‌ను సప్లై చేయడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన మండిపడ్డారు. జెన్‌కోకు సింగరేణి నాసిరకం బొగ్గు సప్లై చేయడం వల్ల రూ.2,900 కోట్ల ప్రజాధనం వృథా అయింది అని కేటీఆర్ తెలిపారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): వైటీపీఎస్‌తో పాటు థర్మల్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిన ఘటనలపై బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జెన్‌కోకు నాసిరకం బొగ్గు సరఫరా చేస్తున్నారంటూ మంత్రి వివేక్ వెంకటస్వామికి చెందిన పేపర్‌లోనే వార్త వచ్చింది. జెన్‌కో అనే సంస్థకు ఫస్ట్ ప్రియారిటీ కింద సింగరేణి టాప్ క్వాలిటీ బొగ్గు ఇవ్వాలి. కానీ బొగ్గు నిల్వలు లేక వారం రోజులుగా పవర్ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

24.9.2026

మేషం: దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. సంతాన ఉద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు ఉంటాయి. ఆర్థిక ఇబ్బందులు అధిగమించడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

వృషభం: వృత్తి వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. మానసిక ఆందోళనలు కొంత చికాకు పరుస్తాయి. స్థిరాస్థి కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వేస్తారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులలో జాప్యం తప్పదు. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

మిధునం: ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. సంఘంలో గౌరవం పెరుగుతుంది. సోదరుల సహాయ సహకారాలతో కొన్ని వ్యవహారాలు పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. నూతన వస్తు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కర్కాటకం: అవసరానికి చేతిలో ధనం నిల్వ ఉండదు. కోపాన్ని అదుపులో ఉంచుకోవడం మంచిది. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. కొందరి ప్రవర్తన వలన మానసిక ఆందోళనలు తప్పవు. నేత్ర సంబంధిత అనారోగ్యాలు కొంత బాధిస్తాయి.

సింహం: మానసికంగా మరింత ఉత్సాహంగా ఉంటారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ అవసరానికి ధన సహాయం లభిస్తుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంతాన వివాహ విషయమై గృహమున ప్రస్తావన వస్తుంది. వృత్తి ఉద్యోగాలలో నూతన అవకాశాలు లభిస్తాయి.

కన్య: మీ ఆలోచనలు ఇతరులకు నచ్చే విధంగా ఉండవు. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి.

తుల: ఇతరులకు సైతం సహాయ సహకారాలు అందిస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. దూరప్రాంత బంధుమిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. దీర్ఘకాలిక ఋణాలు తీర్చగలుగుతారు. వృత్తి వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుకుంటారు.

వృశ్చికం: వృత్తి వ్యాపారాలలో విశేషలాభాన్ని ఆర్జిస్తారు. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లాభిస్తాయి. ఒక వ్యవహారానికి సంబంధించి ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తారు. నూతన వస్త్రాభరణాలను కొనుగోలు చేస్తారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. ఆర్థిక ఇబ్బందులు అధిగమించి ముందుకు సాగుతారు.

ధనస్సు: ఇంటా బయట విలువ మరింత పెరుగుతుంది. సమాజంలో పేరు కలిగిన వ్యక్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కొన్ని విషయాలను ధైర్యంగా నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుతారు. వృత్తి ఉద్యోగాలు అనుకూలిస్తాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. దైవానుగ్రహంతో కొన్ని పనులు పూర్తవుతాయి.

మకరం: బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. చాలా కాలంగా పూర్తికాని పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

కుంభం: ఆర్థిక పరిస్థితి మరింత నిరుత్సాహపరుస్తుంది. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. సోదరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు తప్పవు.

మీనం: సమాజంలో పేరు, ప్రతిష్ఠలు పెరుగుతాయి. ఋణబాధలు నుండి ఉపశమనం పొందుతారు. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆరోగ్యం మెరుగవుతుంది. ఇతరులకు సహాయ సహకారాలు అందిస్తారు. స్త్రీ సంబంధిత ధన లాభ సూచనలు ఉన్నవి.

# బన్సాల్ పాచికలు

మొదటి పేజీ తరువాయి

విధానాన్ని ప్రదర్శించారు. 2014 నుంచి 2022 వరకు ఉత్తరప్రదేశ్‌లో పార్టీ సంస్థాగత బాధ్యతల్లో కీలకంగా పనిచేసిన ఆయనకు ఆ రాష్ట్రంలో బూత్ స్థాయి వ్యవస్థను పటిష్టం చేయడంలో ముఖ్య పాత్ర ఉందని పలు రాజకీయ విశ్లేషణలు చెప్పాయి. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బన్సాల్‌కు పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణ బాధ్యతలు అప్పగించారు. ఒడిశాలో 2024 ఎన్నికల సమయంలో బీజేపీ సంస్థాగతంగా భారీ విస్తరణ సాధించగా.. పశ్చిమ బెంగాల్‌లో 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం బూత్ స్థాయి నిర్వహణ, స్థానిక నాయకత్వ సమన్వయం, కార్యకర్తల వ్యవస్థపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టినట్లు నివేదికలు వెల్లడించాయి. ఇప్పుడు అదే సంస్థాగత అనుభవంతో తెలంగాణపై మరింత దృష్టి పెట్టనున్న బన్సాల్.. రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీకి కొత్త వ్యూహాత్మక దిశను నిర్మించడంపై కసరత్తు చేస్తున్నారు.

బెంగాల్‌లో బీజేపీ వ్యూహాలకు కీలకంగా పనిచేసిన సునీల్ బన్సాల్‌కు తెలంగాణ బాధ్యతలను మరోసారి అప్పగించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. 2028 శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా బీజేపీ అధిష్ఠానం ఇప్పటి నుంచే సంస్థాగత కసరత్తును ముమ్మరం చేసింది. ఈ క్రమంలో తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా సునీల్ బన్సాల్‌ను కొనసాగిస్తూ.. అభయ్ పాటిల్, రేఖా శర్మలను సహ ఇన్‌చార్జిలుగా నియమించింది. ఇదే సమయంలో బన్సాల్‌కు పశ్చిమ బెంగాల్ బాధ్యతలను కూడా కొనసాగించింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించాలన్న లక్ష్యంతో బీజేపీ వ్యూహరచన చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఇప్పటికే 2028 ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యమని ప్రకటించారు.

'ఎలక్షన్ ఇంజినీర్'కు తెలంగాణ పగ్గాలు

సునీల్ బన్సాల్‌ను బీజేపీ వర్గాల్లో ఎన్నికల వ్యూహాలను అమలు చేయడంలో దిట్టగా భావిస్తారు. ఉత్తరప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత బలోపేతంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో ప్రచారక్‌గా పనిచేసిన ఆయనకు క్షేత్రస్థాయి రాజకీయాలపై విస్తృత అనుభవం ఉంది. 2014లో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ఎన్నికల వ్యవహారాల్లో కీలక బాధ్యతలు చేపట్టిన బన్సాల్.. ఆ తర్వాత రాష్ట్రంలో పార్టీ సంస్థాగత విస్తరణలో ముఖ్య పాత్ర పోషించారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వరుస విజయాలకు ఆయన వ్యూహాలు కూడా దోహదపడ్డాయని పార్టీ వర్గాలు పేర్కొంటుంటాయి. ఒడిశాలోనూ పార్టీ బలోపేతంలో ఆయన పాత్రను బీజేపీ నాయకత్వం ప్రస్తావిస్తూ వచ్చింది. పశ్చిమ బెంగాల్‌లోనూ పార్టీ సంస్థాగత వ్యూహాలకు బన్సాల్ పనిచేశారు. అందుకే తెలంగాణ వంటి రాజకీయంగా సంక్లిష్టమైన రాష్ట్రానికి ఆయనను కొనసాగించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అభయ్ పాటిల్‌కూ ఎన్నికల అనుభవం

సహ ఇన్‌చార్జిగా నియమితులైన అభయ్ పాటిల్‌కు కూడా ఎన్నికల నిర్వహణలో అనుభవం ఉంది. తెలంగాణలో పార్టీ సంస్థాగత వ్యవహారాలపై ఆయన గతంలోనే దృష్టి సారించారు. బీజేపీ అంతర్గత వ్యవహారాల్లో రాష్ట్ర నేతలతో సమన్వయం చేస్తూ ముందుకెళ్లిన అనుభవం ఆయనకు ఉంది. తాజా సంస్థాగత మార్పుల్లో అభయ్ పాటిల్‌తో పాటు రేఖా శర్మను కూడా తెలంగాణ సహ ఇన్‌చార్జిగా నియమించడం ద్వారా రాష్ట్ర పార్టీ వ్యవహారాలకు అదనపు పర్యవేక్షణ వ్యవస్థను బీజేపీ ఏర్పాటు చేసింది.

ఎంపీ ఎన్నికల ఫలితాలే బలమా?

2024 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఎనిమిది స్థానాలను గెలుచుకుంది. దీంతో రాష్ట్రంలో పార్టీకి ఉన్న ఎన్నికల అవకాశాలపై జాతీయ నాయకత్వంలో ఆసక్తి పెరిగింది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన ఫలితాలను అసెంబ్లీ ఎన్నికల్లో పునరావృతం చేయడం అంత సులభం కాదన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. రాష్ట్రంలో పార్టీకి ఉన్న నాయకత్వం, నియోజకవర్గాల వారీగా సంస్థాగత బలం, నేతల మధ్య సమన్వయం, స్థానిక సామాజిక సమీకరణాలు వంటి అంశాలు అసెంబ్లీ ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి. ఇటీవలి నెలల్లో తెలంగాణ బీజేపీలోని వివిధ శక్తికేంద్రాల మధ్య సమన్వయంపై జాతీయ నాయకత్వం దృష్టి పెట్టినట్లు వార్తలు వచ్చాయి. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, సునీల్ బన్సాల్, అభయ్ పాటిల్ పలువురు రాష్ట్ర నేతలతో సమావేశమై పార్టీ అంతర్గత సమన్వయంపై చర్చించినట్లు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది.

బెంగాల్ వ్యూహం.. తెలంగాణలో పనిచేస్తుందా?

బీజేపీకి ఇప్పుడు అసలు ప్రశ్న ఇదే. ఒక రాష్ట్రంలో విజయవంతమైన ఎన్నికల వ్యూహాన్ని మరో రాష్ట్రంలో యథాతథంగా అమలు చేయడం సాధ్యం కాదు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య ప్రధాన పోటీగా రాజకీయ సమీకరణం ఏర్పడినప్పటికీ.. తెలంగాణలో పరిస్థితి భిన్నం. ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య పోటీతో పాటు నియోజకవర్గాల వారీగా మారుతున్న సామాజిక, రాజకీయ సమీకరణాలు కూడా కీలకంగా మారుతున్నాయి. బెంగాల్‌లో అధికార వ్యతిరేకత, బలమైన సంస్థాగత నిర్మాణం, స్థానిక రాజకీయ పరిస్థితులను బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకోవడానికి ప్రయత్నించింది. తెలంగాణలో మాత్రం అదే నమూనా పనిచేయాలంటే స్థానిక రాజకీయ వాస్తవాలకు అనుగుణంగా వ్యూహాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. 2028 అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ.. బీజేపీ మాత్రం ఎన్నికల ఏడాది వరకు వేచి చూడకుండా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తాజా నియామకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో పార్టీ బలం, బలహీనతలను అంచనా వేయడం.. బూత్ స్థాయిలో సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం.. నాయకుల మధ్య సమన్వయం పెంచడం.. ప్రజా సమస్యలను రాజకీయ అంశాలుగా మలచడం.. బలమైన అభ్యర్థులను ముందుగానే గుర్తించడం వంటి అంశాలపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. బీజేపీకి ప్రస్తుతం ఉన్న ఎనిమిది లోక్‌సభ స్థానాలను అసెంబ్లీ స్థాయిలో విస్తరించాలంటే కేవలం జాతీయ నాయకుల ప్రచారం సరిపోదు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక నాయకత్వం, కేడర్, సామాజిక సమీకరణాలు, ఓటు బదిలీ సామర్థ్యం కీలకంగా మారనున్నాయి.

బన్సాల్‌కు ఇదే అసలు సవాల్

తెలంగాణలో బీజేపీకి ఇప్పుడు సునీల్ బన్సాల్ ముందున్న సవాల్ కేవలం ఎన్నికల వ్యూహ రచన మాత్రమే కాదు. పార్టీకి లభించిన లోక్‌సభ ఊపును అసెంబ్లీ స్థాయికి తీసుకురావడం, నేతల మధ్య సమన్వయాన్ని పెంచడం, కాంగ్రెస్--బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా పార్టీని నిలబెట్టడం, నియోజకవర్గాల వారీగా బలమైన ఎన్నికల యంత్రాంగాన్ని నిర్మించడం ఆయన ముందున్న ప్రధాన బాధ్యతలు. బెంగాల్‌లో పనిచేసిన వ్యూహాలను తెలంగాణ నేలకు తగ్గట్టుగా మలచగలరా? లోక్‌సభలో వచ్చిన బలాన్ని అసెంబ్లీ ఓట్లుగా మార్చగలరా? రాష్ట్ర బీజేపీలోని అంతర్గత విభేదాలకు తెరదించి ఒకే నాయకత్వం కింద పార్టీని నడిపించగలరా? ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఇప్పుడు సునీల్ బన్సాల్ బృందంపైనే ఉంది. తెలంగాణలో బీజేపీకి వచ్చే అసెంబ్లీ ఎన్నికలు.. బన్సాల్ రాజకీయ వ్యూహాలకు కూడా కీలక పరీక్షగా మారనున్నాయి.

# రేవంత్ సర్కారు దద్దమ్మ

మొదటి పేజీ తరువాయి

క్యూసెక్కుల నీటిని తీసుకురావాల్సి ఉండగా, కేవలం 800 క్యూసెక్కుల నీటిని మాత్రమే వినియోగించుకుంటున్నారని హరీశ్ రావు తెలిపారు. మిగిలిన నీటిని సీఎం గురువు చంద్రబాబు తన సొంత జిల్లాకు తరలించుకుపోతున్నారని ఆరోపించారు. ఐదు మోటార్లతో 24 గంటల పాటు ప్రాజెక్టును నడపాల్సి ఉండగా, కేవలం మూడు మోటార్లతో ఎనిమిది గంటలు మాత్రమే నడుపుతూ నీటిని విడుదల చేస్తున్నారని విమర్శించారు. 4 వేల క్యూసెక్కుల నీటిని తీసుకునే అవకాశం ఉన్నప్పుడు కేవలం 800 క్యూసెక్కులు ఎందుకు ఇస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వరంగల్ జిల్లాలోని దేవాదుల ప్రాజెక్టులో సమ్మక్క బ్యారేజీని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. గోదావరిలో నీళ్లు ఉన్నప్పటికీ రైతులకు ఎందుకు నీటిని విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపైనా హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. నల్లగొండను ముంచి ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు మళ్లిస్తున్నారని ఆరోపించారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం సాధించిందేమిటని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్రీశైలం నుంచి 88 టీఎంసీల నీటిని తీసుకున్నట్లు చెప్పారని, వాస్తవానికి 8.8 టీఎంసీలు మాత్రమే తీసుకున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ప్రజలకు ఇలా అబద్ధాలు చెప్పి మోసం చేస్తున్నారని ఆరోపించారు. పాలమూరు జిల్లాను కరువు జిల్లాగా మార్చింది గత కాంగ్రెస్ ప్రభుత్వమేనని హరీశ్ రావు గుర్తుచేశారు. పాలమూరు జిల్లా బిడ్డగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ జిల్లాకు నీళ్లు ఇవ్వకుండా ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీశైలంలో 96 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆ నీటిని వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీ-3 కాలువలో మిగిలిన పనులను పూర్తి చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదుల్లో లభ్యమయ్యే నీటిని వినియోగించుకుని 24 గంటల పాటు నీటిని ఎత్తిపోసి రైతులకు అందించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మీ ఇంటికే.. 'మీ సేవ'

˘మొదటి పేజీ తరువాయి

ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్ పూర్తైన తర్వాత నిర్ణయించిన సమయంలో మీసేవ ఎగ్జిక్యూటివ్, ఏజెంట్ నేరుగా దరఖాస్తుదారుడి ఇంటికి వచ్చి.. అవసరమైన పత్రాలను పరిశీలించి, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన సేవలను అందిస్తారు. మీసేవ డోర్ డెలివరీ ద్వారా పలు కీలకమైన పౌర సేవలను పొందే అవకాశం ఉంది. జనన, మరణ ధృవీకరణ పత్రాలు, వాటిలో అవసరమైన మార్పులు, పిల్లల పేర్లను చేర్చడం వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. అలాగే కులం, ఆదాయం, నివాసం, పుట్టిన తేదీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, మైనారిటీ, ఓబీసీ వంటి ధృవీకరణ పత్రాలకు సంబంధించిన సేవలను కూడా ఇంటి వద్దే పొందవచ్చు. ఇక ఆధార్‌కు సంబంధించిన కొన్ని సేవలు కూడా ఈ విధానంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. కొత్త ఆధార్ నమోదు, 5 ఏళ్లలోపు చిన్నారుల ఆధార్‌కు సంబంధించిన సేవలు, జనాభా వివరాల్లో మార్పులు, పేరు, మొబైల్ నంబర్, చిరునామా మార్పు వంటి సేవలు ఇందులో ఉన్నాయి. ప్రజలకు అవసరమైన రిజిస్ట్రేషన్ శాఖ సేవలను కూడా డోర్ డెలివరీ విధానంలో అందించనున్నారు. ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) కాపీలు, ఐజీఆర్ఎస్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్, సొసైటీ రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ, ధ్రువీకరించిన ప్రతుల వంటి సేవలు ఇందులో ఉన్నాయి. పోలీస్ శాఖకు సంబంధించిన కొన్ని ధృవీకరణ సేవలను కూడా ఇంటి వద్ద నుంచే పొందే అవకాశం కల్పించారు. దీంతో వివిధ ధృవీకరణ పత్రాల కోసం ప్రభుత్వ ఆఫీసులు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గనుంది. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, ఉద్యోగాల కారణంగా సమయం కేటాయించలేని వారికి ఈ విధానం ఉపయోగపడే అవకాశం ఉంది.

# ఆగమాగం చేస్తే తాటతీస్తాం

మొదటి పేజీ తరువాయి

భద్రతా చర్యలు చేపట్టినట్లు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీపీ సజ్జనార్.. పలు కీలక వివరాలను వెల్లడించారు. ప్రజలు, గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. గణేశ్ నిమజ్జన వేడుకల సందర్భంగా హైదరాబాద్ నగరంలో దాదాపు 20 వేల మంది పోలీసులను బందోబస్తు విధుల్లో మోహరించనున్నట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. ఇతర జిల్లాల నుంచి మరో 8,400 మంది పోలీసులను విధులకు వినియోగించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఖైరతాబాద్, బాలాపూర్ గణేశ్ విగ్రహాల శోభాయాత్రకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈసారి గణేశ్ నిమజ్జన ఏర్పాట్ల పర్యవేక్షణలో ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు తెలిపారు. శోభాయాత్ర, నిమజ్జన ప్రాంతాలను పర్యవేక్షించేందుకు 24 డ్రోన్లు అందుబాటులో ఉంటాయని సీపీ సజ్జనార్ చెప్పారు. నగరంలోని దాదాపు 10 వేల సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసినట్లు వెల్లడించారు.

# జోరుగా పంటల్లోకి!

మొదటి పేజీ తరువాయి

అధికారులను ఆదేశించినట్లు తెలంగాణ ప్రతినిధులు వెల్లడించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, సాగునీటి కొరతతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కర్ణాటక సీఎంకు వివరించారు. నారాయణపూర్ నుంచి నీటిని విడుదల చేస్తే జూరాల ప్రాజెక్టుతో పాటు భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రస్తుతం ఉమ్మడి పాలమూరు ప్రాంతంలోని వివిధ ప్రాజెక్టుల కింద సుమారు 5.5 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులో ఉందని తెలంగాణ ప్రతినిధులు వివరించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలకు అవసరమైన నీటి లభ్యత తగ్గిందని, ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నాయని తెలిపారు. ఈ సమయంలో సాగునీరు అందకపోతే పంటలు ఎండిపోయి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు పంటలపై పెట్టుబడులు పెట్టిన దశలో నీటి కొరత ఏర్పడితే వారి ఆదాయంపై తీవ్ర ప్రభావం పడుతుందని మంత్రులు, ఎమ్మెల్యేలు వివరించారు. వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాల జీవనోపాధి కూడా దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఇప్పటికే వర్షాల లోటు కారణంగా సాగు పరిస్థితులు సవాలుగా మారాయని కర్ణాటక సీఎంకు వివరించారు.

# సెక్రటేరియట్‌లో ఇంటర్నెట్ బంద్

మొదటి పేజీ తరువాయి

సేవలు నిలిచిపోవడం ఏంటని ఆయా పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే విజిటర్స్ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు..? ఇంత పెద్ద వ్యవస్థలో ఇంటర్నెట్ సేవలు పని చేయకపోతే.. రాష్ట్రంలో పరిపాలన ఎలా ముందుకు సాగుతుందని ప్రశ్నిస్తున్నారు.



# తగ్గనున్న వంటనూనెల ధరలు

మొదటి పేజీ తరువాయి

విధించింది. కొత్త నిబంధనల ప్రకారం, ముడి సోయాబీన్, పామాయిల్‌పై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని 10 శాతం నుండి 5 శాతానికి తగ్గించగా, శుద్ధి చేసిన (రిఫైన్డ్) సోయాబీన్, పామాయిల్‌పై 32.5 శాతం నుండి 27.5 శాతానికి తగ్గించారు. ఇక ముడి పొద్దుతిరుగుడు నూనెపై పన్నును పూర్తిగా సున్నాకు తీసుకురాగా, శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు నూనెపై పన్నును 32.5 శాతం నుండి 22.5 శాతానికి తగ్గించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో సరఫరా అంతరాయాల వల్ల అంతర్జాతీయంగా ధరలు పెరగడంతో.. మూడింట రెండు వంతుల నూనెను దిగుమతి చేసుకునే భారత్‌లో ఈ ధరల ఒత్తిళ్లు పెరిగాయి. పన్ను తగ్గింపు వల్ల సాధారణ వినియోగదారులకు తక్కువ ధరకే నూనెలు లభించడమే కాకుండా, రైతులకు మద్దతు ధర లభించి, అంతర్జాతీయ మార్కెట్లలోనూ డిమాండ్ బలపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. రిటైల్ ధరల్లోనూ పొద్దుతిరుగుడు నూనె గరిష్ఠంగా రూ. 8 నుండి రూ. 12 వరకు తగ్గే అవకాశం ఉంది. ముడి పామాయిల్, సోయాబీన్ల రిటైల్ ధరలు లీటరుకు రూ. 5 నుండి రూ. 8 వరకు తగ్గుతాయి.

# అంతా థర్డ్ గ్రేడ్

మొదటి పేజీ తరువాయి

జనరేషన్ స్టేషన్లు బంద్ అవుతున్నాయి. సింగరేణికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 52 వేల కోట్లు బాకీ ఉంది.. అందుకే థర్డ్ గ్రేడ్ బొగ్గు సరఫరా చేస్తున్నారు.. నాణ్యమైన బొగ్గును ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తున్నారు. ఈ నాసిరకం బొగ్గు వల్ల పవర్ స్టేషన్లు షట్‌డౌన్ అయ్యాయని తెలిపారు. సింగరేణిలో సైట్ విజిట్ సర్టిఫికేట్ పేరిట జరిగిన కుంభకోణాలు ముందే చెప్పాం.. కేంద్ర ప్రభుత్వానికి కూడా చెప్పాం. దొంగకే తాళం ఇచ్చినట్లు, కేంద్ర బొగ్గు శాఖా మంత్రి రాష్ట్ర ప్రభుత్వానికే లేఖ రాశాడు.. దొంగ, చీకటి ఒకటయ్యాయి. రాష్ట్రంలో గ్రాస్ మిస్‌మేనేజ్‌మెంట్ ఆఫ్ రిసోర్సెస్, గ్రాస్ మిస్‌మేనేజ్‌మెంట్ ఆఫ్ ఫైనాన్స్ జరుగుతుంది. బొగ్గు లేక వారం రోజుల్లో ఐదు పవర్ జనరేషన్ యూనిట్లు బంద్ అయ్యాయి. మేము కొన్ని రోజుల క్రితమే సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని, రూ. 1600 కోట్ల కుంభకోణం జరిగిందని బయటపెట్టాం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బొగ్గు ఉందని అంటున్నడు.. బొగ్గు నిజంగానే ఉంటే కోల్ నిల్వలు నిల్ అని వార్తలు ఎందుకు వస్తున్నాయి? పవర్ జనరేషన్ యూనిట్లు ఎందుకు బంద్ అయితున్నయి? అని నిలదీశారు. బొగ్గు లేక 4,000 మెగావాట్ల కెపాసిటీ గల యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో కేవలం 400 మెగావాట్ల మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. భద్రాద్రిలో కూడా 270 మెగావాట్ల కెపాసిటీ గల విద్యుత్ కేంద్రాన్ని మూసేశారు. సింగరేణి వాళ్లను ఇదేంటని అడిగితే.. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి రూ.52,000 కోట్లు రావాలని, అందుకే డబ్బులు ఇచ్చిన వాళ్లకే ఫస్ట్ గ్రేడ్ కోల్ ఇచ్చి, జెన్కోకు థర్డ్ గ్రేడ్ కోల్ ఇస్తున్నామని చెప్తున్నారు అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు థర్మల్ పవర్ స్టేషన్లలో ఏం జరుగుతుందో నిజానిజాలు తేల్చడానికి ఆరు బీఆర్ఎస్ బృందాలు గురువారం పవర్ స్టేషన్లకు వెళ్తాయని కేటీఆర్ తెలిపారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్న స్పష్టమైన డిమాండ్‌తో, పంపులు ఆన్ చేసి నీళ్ళు విడుదల చేయాలన్న డిమాండ్‌తో పవర్ ప్లాంట్ల పర్యటనకు వెళ్తారని పేర్కొన్నారు.

# 25న నిమజ్జనం సెలవు

మొదటి పేజీ తరువాయి

పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సాధారణ సెలవు ప్రకటించింది. ఈ సెలవుకు బదులుగా నవంబర్ 14న పనిదినంగా పరిగణించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

# ఉద్యోగుల బకాయిలు తీర్చాలి: జీవన్‌రెడ్డి

జగిత్యాల, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించడంతోపాటు 2023 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించారని అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ముఖ్య భూమిక పోషిస్తున్నారని పేర్కొన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాల్సి ఉన్నప్పటికీ పీఆర్సీ అమలు కాకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన నెలకొందన్నారు. గతంలో 42 శాతం ఫిట్‌మెంట్ అమలు చేసిన నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను పరిష్కరించాలని కోరారు. సుమారు రూ.20 వేల కోట్ల బకాయిలను ఏడాదిలోగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా రూ.2 వేల కోట్ల చొప్పున విడుదల చేస్తే ఏడాదిలో బకాయిలను పూర్తిగా చెల్లించవచ్చని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.



## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## ఆటో కార్మికుల సేవలు అభినందనీయం

గంగాధర, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు సుద్దాల అశోక్ ఆధ్వర్యంలో యూనియన్ కార్యవర్గ సభ్యులు కరీంనగర్ జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుల సమస్యలు, యూనియన్ కార్యకలాపాలపై చర్చించారు. ఈ సందర్భంగా గుమ్మడి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఆటో కార్మికులు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని, వారి సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రయాణికులకు సురక్షితమైన రవాణా సేవలు అందిస్తూ ప్రజల అవసరాలను తీర్చడంలో ఆటో కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. యూనియన్ సభ్యులు ఐక్యంగా ఉంటూ తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు నాగార రవీందర్, మహంకాళి తిరుపతి, పల్నాటి సత్తయ్య, గౌరవ అధ్యక్షుడు రామ్‌చందర్, పర్లపల్లి మల్లేశం, కోశాధికారి గట్టేపల్లి తిరుపతి, బొంతపల్లి అంజయ్యతో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నూకలమర్రిలో ఘనంగా కుంకుమార్చన

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): నూకలమర్రి గ్రామంలో నేస్తం యూత్ ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు, యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన చేసి అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో ఉప్పల తిరుపతి, పాలకుర్తి సుమంత్, ఉప్పుల రఘు, రవి, భూమేష్, శంకర్, ఊరిడి బాబురెడ్డి, ఉప్పుల గౌతమ్, జంగం వంశీ, పులి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



## కిషన్‌గంజ్‌లో అన్నదానం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): కిషన్‌గంజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్‌రావు పాల్గొని పేదలకు అన్నవితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ, దాతృత్వం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, సమాజం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పేదలకు అండగా నిలుస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కిషన్‌గంజ్ యూత్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో బజరంగ్ సేన నాయకులు హరి, సాయి, సంతోష్, నరేందర్ యాదవ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి వచ్చే భక్తులకు జ్ఞాపికల అందజేత

జగిత్యాల, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా లో గణేశ్ నిమజ్జనోత్సవానికి తరలివచ్చిన భక్తులకు గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు స్వాగతం పలుకుతూ జ్ఞాపికలను అందజేశారు. నిమజ్జనోత్సవాల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌కు కూడా సమితి సభ్యులు జ్ఞాపికను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్, పట్టణ అధ్యక్షుడు జిత్తవేని అరుణ్, సీనియర్ నాయకులు ఏసీఎస్ రాజు, గట్టు సతీష్, బొనగిరి దేవయ్య, ఒద్దినేని హరిచరణ్‌రావు, రగిల్ల సత్యనారాయణ, అంకర్ సుధాకర్, ఒల్లం మల్లేశం, గాజుల రాజేందర్, బొందుకూరి శ్రీనివాస్, ఎర్ర శ్రీనివాస్, అమందు త్రిలోక్, నిమిషకవి వంశీ, రాపర్తి రాజు, కొప్పు సుశీల్, మదిశెట్టి మల్లేశం, గట్టిపెల్లి జ్ఞానేశ్వర్, పదం మహేందర్, బండి సత్యనారాయణ, బైరి రాజేందర్, గదసు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



## కిడ్స్ కాన్వెంట్ ప్రిన్సిపాల్‌కు జాతీయ పురస్కారం



వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): వేములవాడ కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ దరక్షన్ వస్పియాకు విద్యారంగంలో 25 ఏళ్లుగా అందిస్తున్న సేవలకు అరుదైన గుర్తింపు లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును అందజేశారు. 25 ఏళ్లుగా విద్యార్థులకు విద్యాబోధన అందిస్తూ, వారిని వైద్యులు, ఇంజినీర్లు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దడంలో ఆమె సేవలు అందించారని నిర్వాహకులు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యా, ఆర్థిక సహాయం అందిస్తూ విద్యారంగంలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు సమాజ సేవలో ఆమె చురుకుగా పనిచేస్తున్నారని తెలిపారు. అవార్డు అందుకున్న సందర్భంగా కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, వేములవాడ పట్టణానికి చెందిన పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందిస్తూ మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

## హిందుస్థాన్ స్కౌట్స్ అధ్యక్షుడిగా గిరీష్ జుయాల్



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ జాతీయ స్థాయి త్రైవార్షిక ఎన్నికలు జమ్మూలోని అగ్రవాల్ ధర్మశాలలో నిర్వహించారు. దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించారు. ఎన్నికల్లో గిరీష్ జుయాల్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. డాక్టర్ కరుణాకర్ ప్రధాన్ జాతీయ చైర్మన్‌గా, మధుసూదన్ గుప్తా జాతీయ చీఫ్ కమిషనర్‌గా వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. జాతీయ ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఓం ప్రకాశ్ శ్రీవాస్తవ, డాక్టర్ ఎం. రజనీ, దీపక్ కలితా, వనితా శర్మ, అవధేశ్ శర్మ ఎన్నికయ్యారు. రానున్న మూడేళ్లలో సంస్థ కార్యకలాపాలను దేశవ్యాప్తంగా విస్తరించేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు, విద్యాసంస్థల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను విస్తరించి యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయనున్నట్లు పేర్కొంది. తెలంగాణ నుంచి నోడల్ అధికారి ఎం. మహేందర్ నాయక్, ప్రతినిధులు పి. నాగరాజు, స్వాతి, దివ్య అర్చన ఎన్నికల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో కార్యక్రమాల విస్తరణతో పాటు జాతీయ స్థాయిలో సంస్థను బలోపేతం చేసేందుకు సహకరిస్తామని వారు తెలిపారు.



## పత్తి రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ

గంగాధర, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని అచంపల్లి గ్రామంలో పత్తి రైతులకు ఎఫ్‌ఎఫ్‌బీ పత్తి సాగుకు సంబంధించిన గుర్తింపు కార్డులను గ్రామ సర్పంచ్ ఆరే తేజశ్రీ రాజశేఖర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గుర్తింపు కార్డులు పొందడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. కార్డుల ద్వారా రైతులకు పలు ప్రయోజనాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు, బీసీఐ ప్రాజెక్టు ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## బందోబస్తులో ట్రాన్స్‌జెండర్ల విధులు

జగిత్యాల, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో జిల్లాలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. భక్తులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఈసారి 17 మంది ట్రాన్స్‌జెండర్లను బందోబస్తు విధుల్లో భాగస్వాములను చేసింది. నిమజ్జన ప్రాంతాల్లో భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు శాంతిభద్రతల పర్యవేక్షణలో వారు పోలీసులతో కలిసి విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది కూడా ట్రాన్స్‌జెండర్లు బందోబస్తులో బాధ్యతాయుతంగా సేవలందించారని పోలీసు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తమపై నమ్మకంతో విధుల్లో అవకాశం కల్పించిన జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌కు ట్రాన్స్‌జెండర్లు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుశాఖ కల్పించిన ఈ అవకాశం తమలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని పేర్కొన్నారు.

## ప్రాథమిక పాఠశాల సమస్యలపై వినతి

జగిత్యాల, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా చిల్వకోడూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్‌జీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాలల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఉపాధ్యాయుల ఇబ్బందులను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేశ్‌గౌడ్, మ్యాన సాగర్, జిల్లా, మండలాల ఎస్‌జీటీయూ బాధ్యులు, జిల్లా ఎస్‌జీటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## పాత్రికేయుడు నవీన్ పటేల్‌కు అరుదైన గౌరవం

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): వేములవాడ ప్రాంతానికి చెందిన జర్నలిస్టు చేకూర్తి నవీన్ పటేల్‌కు అరుదైన గౌరవం లభించింది. సామాజిక సేవతో పాటు పాత్రికేయ రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నవీన్ పటేల్ అవార్డును అందుకున్నారు. గత ఐదేళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ, మరోవైపు పాత్రికేయ వృత్తిలో అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నవీన్ పటేల్‌కు అవార్డు లభించడంపై పలువురు జర్నలిస్టులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.



## గణేశుడికి బండి రమేష్ ప్రత్యేక పూజలు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 23 (ఈవార్తలు): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ బుధవారం నియోజకవర్గంలోని పలు గణేశ్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ మూడో, నాలుగో దశల్లో ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహాలను దర్శించుకున్నారు. అనంతరం మూసాపేట డివిజన్ ఆంజనేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రజలంతా వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, ఐక్యతతో జరుపుకోవడం సంతోషకరమన్నారు. విఘ్నేశ్వరుడు ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు.



# ఆర్తనాదాల నుంచి అవకాశాల వైపు!

**'టైగర్ విడోస్' కాదు.. ఆడబిడ్డలే అసలైన పులులు.. కన్నీటి గాథలకు 'స్వయం' ఉపాధితో కొత్తదారులు**

## కేంద్ర ప్రభుత్వ చర్యలతో మారిన రూపురేఖలు

(ఈవార్తలు - ఎడిటర్స్ నోట్)
సుందర్‌బన్ అందాలను చూస్తే ప్రకృతి పరవశించిపోతుంది. మడ అడవులు.. నదీ జలాలు.. పచ్చదనం.. రాయల్ బెంగాల్ టైగర్.. పర్యాటకుల పడవలు.. ఇవన్నీ కలసి ఒక అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరిస్తాయి. కానీ ఆ అందాల వెనుక మరో సుందర్‌బన్ ఉంది. తుపాన్లతో పోరాడే సుందర్‌బన్.. ఉప్పునీటితో పోరాడే సుందర్‌బన్.. పులి భయంతో జీవించే సుందర్‌బన్.. జీవనోపాధి కోసం అడవిలోకి వెళ్లక తప్పని కుటుంబాల సుందర్‌బన్. అక్కడే 'టైగర్ విడోస్' కథ మొదలవుతుంది.

పులి దాడిలో భర్తను కోల్పోయిన మహిళకు ఆ ఒక్క క్షణం జీవితాన్ని రెండు భాగాలుగా విడగొడుతుంది. దాడికి ముందు ఒక జీవితం.. దాడి తర్వాత మరో జీవితం. భర్త కుటుంబానికి ఆధారం. ఆయన మరణంతో ఆదాయం ఆగిపోతుంది. పిల్లల బాధ్యత మీద పడుతుంది. తినడానికి, చదివించడానికి, బతకడానికి డబ్బు కావాలి.కానీ ఉపాధి కోసం వెళ్లాల్సిన అడవే భయాన్ని కలిగిస్తుంది. ఇదే సుందర్‌బన్‌లోని విషాద విరోధాభాసం. పులిని కాపాడాల్సిన మనిషి.. అదే పులి ఆవాసం అంచుల్లో తన జీవనోపాధి కోసం పోరాడాల్సి రావడం.






### ప్రకృతి అందాల మధ్య ప్రమాదాల జీవితం

సుందర్‌బన్ ప్రజలకు ప్రకృతి వరం మాత్రమే కాదు.. సవాలు కూడా. చేపలు, పీతలు, తేనె సేకరణ వంటి జీవనోపాధులు వారిని అడవి అంచుల వరకు తీసుకెళ్తాయి. మడ అడవుల నష్టం, చేపల వనరులపై ఒత్తిడి వంటి పరిణామాలు కొంతమంది మత్స్యకారులను పులుల నివాస ప్రాంతాల వైపు మరింతగా వెళ్లే పరిస్థితికి నెట్టుతున్నాయి. ఈ క్రమంలో ప్రాణాలు పోతున్నాయి. ప్రమాదాల్లో మరణించేవాళ్లు ఎక్కువ కుటుంబాలు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవే. ప్రధాన జీవనాధారాన్ని కోల్పోయిన కుటుంబాలకు పరిమిత ఆదాయ వనరులు, తక్కువ సామాజిక భద్రత ఉండటం సమస్యను మరింత తీవ్రం చేస్తోంది.

> "పులి--మనిషి సంఘర్షణకు మించి..
> ఇది జీవనోపాధి సమస్య..
> ఇది పేదరిక సమస్య.
> ఇది వాతావరణ మార్పుల సమస్య.
> ఇది మహిళల ఆర్థిక భద్రత సమస్య."

### తుపాను వస్తే.. ఉప్పునీరే

సుందర్‌బన్‌కు మరో పెద్ద ముప్పు తుపాన్లు. సముద్రానికి దగ్గరగా ఉండటం, తక్కువ ఎత్తులో ఉన్న భూభాగం, నదుల విస్తృత జాలం కారణంగా తుపాన్లు, వరదలు, తీరక్షయం, ఉప్పునీటి చొరబాటు వంటి సమస్యలు ఇక్కడి ప్రజల జీవనాన్ని ప్రభావితం చేస్తాయి. ఒక తుపాను ఇల్లు కూల్చవచ్చు. పంటను నాశనం చేయవచ్చు. చెరువులోని మంచినీటిని ఉప్పునీరుగా మార్చవచ్చు. రోజువారీ జీవనాధారాన్ని దెబ్బతీయవచ్చు. అందుకే సుందర్‌బన్ సంరక్షణ అంటే పులిని కాపాడటంతో ముగియదు. మనిషిని ప్రకృతి విపత్తుల నుంచి రక్షించడమూ అందులో భాగమే.

### కేంద్రం దృష్టి.. అడవితో పాటు మనిషిపై

సుందర్‌బన్‌లోని సమస్యలను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కలిసి పలు చర్యలు చేపడుతున్నాయి. మడ అడవుల పెంపకం, ఉప్పునీటి చొరబాటును ఎదుర్కొనే చర్యలు, తీర రక్షణ గట్లు బలోపేతం, ప్రత్యామ్నాయ జీవనోపాధులు, విపత్తులను ముందుగానే హెచ్చరించే వ్యవస్థలు, వాతావరణాన్ని తట్టుకునే మౌలిక వసతులు వంటి అంశాలపై దృష్టి పెట్టినట్లు ప్రభుత్వాలు వెల్లడించాయి. రాయల్ బెంగాల్ టైగర్ సంరక్షణలో భాగంగా వేట నిరోధక శిబిరాలు, ఆవాసాల మెరుగుదల, కెమెరా ఉచ్చులు, ఉపగ్రహ ఆధారిత పర్యవేక్షణ వంటి చర్యలు కూడా కొనసాగుతున్నాయి. అంటే పులిని కాపాడటం.. ప్రజలను కాపాడటం.. మడ అడవులను కాపాడటం.. ఇవన్నీ వేర్వేరు కార్యక్రమాలు కాకుండా ఒకే జీవవ్యవస్థలో భాగాలుగా చూడాల్సిన అవసరం ఏర్పడింది.

## మడ అడవులే ప్రకృతి కవచం

ఈ పోరాటంలో మడ అడవులకు అత్యంత కీలకమైన పాత్ర ఉంది. మడ చెట్లు తీర ప్రాంతాలకు సహజ రక్షణ కవచంగా నిలుస్తాయి. తుపాన్లు, అలల ప్రభావం, తీరక్షయం వంటి వాటిని తగ్గించడంలో అవి కీలకం. అదే సమయంలో చేపలు, పీతలు, రొయ్యలు తదితర జీవులకు ఆవాసాలను అందిస్తాయి. అందుకే కేంద్ర ప్రభుత్వం మడ తీరప్రాంతాల పునరుద్ధరణ, ఉపాధి కల్పన లక్ష్యంగా 'మిష్టి' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. 2025లో కేంద్రం వెల్లడించిన సమాచారం ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లో సుందర్‌బన్ సహా రాష్ట్రంలోని మడ అడవుల విస్తీర్ణం 2013లో 2,097 చదరపు కిలోమీటర్ల నుంచి 2023లో 2,119.16 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. ఈ పెరుగుదలకు మడ అడవుల పెంపకం, పర్యావరణ పునరుద్ధరణ కార్యక్రమాలతో పాటు మిష్టి, కాంపా-మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి కార్యక్రమాల సమన్వయం దోహదపడినట్లు కేంద్రం తెలిపింది. అంటే ఒక మడ మొక్క నాటడం కేవలం పర్యావరణ కార్యక్రమం కాదు. అది రేపటి తీర రక్షణకు పెట్టుబడి. అదే సమయంలో స్థానికులకు ఉపాధి అవకాశంగా మారే అవకాశం కూడా.



## 'టైగర్ విడోస్'కు కొత్త ఆశ

ఇక్కడే ఇప్పుడు కథలో కీలకమైన మార్పు కనిపిస్తోంది. 'టైగర్ విడోస్'ను కేవలం బాధితులుగా చూడకుండా.. ఆదాయాన్ని సృష్టించగల మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రయత్నాలు మొదలయ్యాయి. గత ఏడాది భారత వ్యవసాయ పరిశోధనా మండలి-జాతీయ మత్స్య జన్యు వనరుల బ్యూరో సుందర్‌బన్‌లో 'మిషన్ నవశక్తి' కార్యక్రమాన్ని విస్తరించింది. గోసాబా ప్రాంతంలోని టైగర్ విడోస్, సామాజికంగా వెనుకబడిన వర్గాల మహిళలకు పర్యావరణానికి అనుగుణమైన ప్రత్యామ్నాయ జీవనోపాధులను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం లక్ష్యం. మహిళలు చేపల పెంపకం, మేకలు-బాతుల పెంపకం, పీతల పెంపకం, అలంకార చేపల పెంపకం, సంప్రదాయ ఉత్పత్తులకు విలువ జోడించడం వంటి రంగాలపై ఆసక్తి చూపింది. ప్రారంభ దశలో సౌర విద్యుత్ దీపాల వంటి పరికరాలను కూడా అందించారు. పరిస్థితి ఎంతలా మారిందంటే.. ఓ చిన్న పడవకూ సోలార్ ప్లేట్ అమర్చి విద్యుత్తును సృష్టించుకుంటున్నారు అక్కడి ప్రజలు. ఇది చిన్న మార్పు కాదు. అడవిలోకి వెళ్లి ప్రమాదాన్ని ఎదుర్కొనే జీవనోపాధి నుంచి.. ఇంటి వద్దే ఆదాయం సంపాదించే అవకాశాల వైపు మలుపు.



## చేపల చెరువులు.. కొత్త ఆదాయ మార్గాలు

సుందర్‌బన్‌లో ప్రత్యామ్నాయ జీవనోపాధుల దిశగా మత్స్య రంగంలోనూ ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2026లో ఐసీఏఆర్--కేంద్ర అంతర్గత మత్స్య పరిశోధనా సంస్థ చేపట్టిన ఒక కార్యక్రమంలో స్థానికుల బ్యాక్ యార్డ్ చెరువులను శాస్త్రీయ చేపల పెంపకానికి ఉపయోగించే విధానాన్ని ప్రోత్సహించారు. బాసంతి ప్రాంతంలో చేపల ఉత్పత్తి ఎకరాకు సగటున 428.2 కిలోల నుంచి 1,240.5 కిలోలకు పెరిగిందని, కుటుంబానికి చేపల పెంపకం ద్వారా వార్షిక ఆదాయం రూ.13,900 నుంచి రూ.39,000కు పెరిగిందని ఐసీఏఆర్ తెలిపింది. ఈ కార్యక్రమంలో మహిళల భాగస్వామ్యం దాదాపు సగానికి చేరింది. అలాగే 2026 జూలైలో సుందర్‌బన్ ప్రాంతంలోని 134 మంది చిన్నస్థాయి మత్స్యకారులకు శాస్త్రీయ చేపల పెంపకం, మిశ్రమ చేపల పెంపకం, ఆహార భద్రత, వాతావరణ మార్పులకు తట్టుకునే జీవనోపాధులపై శిక్షణ ఇచ్చారు.

(పీఐబీ హైదరాబాద్, పీఐబీ కోల్‌కతా సహకారంతో..)

## బాధితురాలి నుంచి వ్యాపారవేత్తగా..

'టైగర్ విడో' అనే పదం వెనుక ఒక విషాదం ఉంది. కానీ ఆమె భవిష్యత్తు కూడా విషాదంగానే ఉండాల్సిన అవసరం లేదు. చేపల పెంపకం.. పీతల పెంపకం.. బాతులు, మేకల పెంపకం.. తేనెటీగల పెంపకం.. స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించడం.. పర్యాటక రంగంలో సేవలు.. మహిళా సంఘాల ద్వారా చిన్న వ్యాపారాలు.. ఇలాంటి ప్రత్యామ్నాయాలు విస్తరితే అడవిపై ప్రత్యక్ష ఆధారపడటం తగ్గే అవకాశం ఉంది. ఇది కేవలం ఒక కుటుంబాన్ని కాపాడటం కాదు. ఒక కుటుంబాన్ని కాపాడటం అంటే ఒక మహిళను రక్షించడం. ఆమె పిల్లల భవిష్యత్తును రక్షించడం. అదే సమయంలో పులి ఆవాసంపై ఒత్తిడిని తగ్గించడం.



### సంరక్షణకు మనిషే భాగస్వామి

సుందర్‌బన్ సంరక్షణలో స్థానిక ప్రజలను భాగస్వాములుగా చేయడం కూడా కీలకం. మడ అడవుల సంరక్షణ, ప్రత్యామ్నాయ ఉపాధి, పర్యావరణ పర్యాటకం, మత్స్య వనరుల పరిరక్షణ.. ఇవన్నీ స్థానిక ప్రజల భాగస్వామ్యంతోనే దీర్ఘకాలికంగా పనిచేసే అవకాశముంది. అందుకే కేంద్ర ప్రభుత్వం సుందర్‌బన్ కోసం రూపొందించే దీర్ఘకాలిక నిర్వహణ ప్రణాళికలో జీవవైవిధ్యం, విపత్తుల నుంచి రక్షణ, సమాజ భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇస్తోంది. స్థానిక సమాజాలను పర్యావరణ అభివృద్ధి, మడ అడవుల సంరక్షణలో భాగస్వాములను చేయడానికి సంయుక్త అటవీ నిర్వహణ కమిటీలను ఉపయోగిస్తోంది.




### ఆర్తనాదాలు వినిపించకూడదంటే..

సుందర్‌బన్‌లో పులి సంరక్షణ విజయవంతం కావాలంటే కేవలం పులుల సంఖ్య పెరగడం సరిపోదు. పులి ఉన్న అడవిలో మనిషి భయంతో కాకుండా భద్రతతో జీవించాలి. తుపాను వచ్చినప్పుడు ఇల్లు, జీవనోపాధి కోల్పోకుండా రక్షణ వ్యవస్థ ఉండాలి. ఉప్పునీరు పంటను నాశనం చేస్తే ప్రత్యామ్నాయ ఆదాయం ఉండాలి. అడవిలోకి వెళ్లకుండా కుటుంబాన్ని పోషించగల ఉపాధి ఉండాలి. పులి దాడిలో కుటుంబ పెద్దను కోల్పోయిన మహిళ ఒంటరిగా మిగలకూడదు. ఆమెకు సాయం మాత్రమే కాదు.. స్వయం ఆధారిత జీవితం కావాలి. అక్కడే సుందర్‌బన్ సంరక్షణకు అసలు అర్థం వస్తుంది. సుందర్‌బన్‌ను సందర్శించే పర్యాటకుడు పులి కోసం ఎదురుచూస్తాడు. కానీ ఈ అడవిని అర్థం చేసుకోవాలంటే పులి కనిపించని సమయంలో కూడా అక్కడి మనుషుల జీవితాన్ని చూడాలి.








# పోదాం పదండి..
# సుందర వనాలకు!

(పులుల అడుగుజాడల్లో.. మడ అడవుల మధ్యలో.. బతుకు పోరాటాల నడుమ సుందర్‌బన్ సఫారీ)

ఒకవైపు ఉప్పునీటి ప్రవాహాలు..
మరోవైపు పచ్చని మడ అడవులు..
మధ్యలో చిన్న చిన్న దీవులు..
వాటిని చీల్చుకుంటూ సాగే కాలువలు..
రహదారులు లేవు.. కాలువలే దారులు.
వాహనాలు లేవు.. పడవలే ప్రయాణ సాధనాలు.
ఎక్కడ చూసినా నీళ్లే కనిపించే ఆ ప్రపంచంలో..
ఒక్కసారిగా పడవ నిశ్శబ్దంగా ఆగిపోతుంది.
అందరి చూపులూ ఒడ్డువైపు మళ్లుతాయి.
మడ చెట్ల మధ్య ఏదైనా కదలిక కనిపిస్తుందా?
ఎక్కడైనా రాయల్ బెంగాల్ టైగర్ అడుగుజాడ ఉందా?
అదే సుందర్‌బన్ ప్రయాణంలో
ప్రతి పర్యాటకుడి మనసులో మెదిలే ప్రశ్న.

పులి కనిపిస్తే ఉత్సాహం..
కనిపించకపోతే నిరాశ..
కానీ సుందర్‌బన్‌ను ఒకసారి చూస్తే..
పులి కనిపించకపోయినా..
ఆ ప్రయాణం మరచిపోలేని అనుభూతి.
ఎందుకంటే సుందర్‌బన్‌లో పులి ఒక భాగం మాత్రమే.



"అక్కడ అడవి ఉంది.. నది ఉంది.. మడ చెట్లు ఉన్నాయి.. చేపలు పట్టే మనుషులు ఉన్నారు.. తేనె సేకరించే మౌలీలు ఉన్నారు.. తరతరాలుగా ప్రకృతిపై ఆధారపడి బతుకుతున్న గ్రామాలు ఉన్నాయి.. పులి దాడుల్లో భర్తలను కోల్పోయిన మహిళల కన్నీటి కథలు ఉన్నాయి. ఇదే సుందర్‌బన్ అసలు కథ."

(ఈవార్తలు - ఎడిటర్స్ నోట్)

## పులి కోసం వెతుకులాట

సుందర్‌బన్ అంటే ముందుగా గుర్తుకొచ్చేది రాయల్ బెంగాల్ టైగర్. ఇక్కడి పులులు మడ అడవులు, నదులు, ఉప్పునీటి వాతావరణానికి అనుగుణంగా జీవిస్తున్నాయి. ఇతర ప్రాంతాల్లోని పులులతో పోలిస్తే సుందర్‌బన్ పులుల జీవన పరిసరాలు పూర్తిగా భిన్నమైనవి. అడవి మధ్యలో పడవ ప్రయాణిస్తుండగా పర్యాటకులంతా ఒడ్డువైపు ఆసక్తిగా చూస్తుంటారు. ఎక్కడైనా పులి అడుగుజాడ కనిపిస్తుందా? ఎక్కడైనా గడ్డి కదులుతుందా? మడ చెట్ల మధ్య రెండు కళ్ల మెరుపు కనిపిస్తుందా? ఇలాంటి ఉత్కంఠే సుందర్‌బన్ పర్యటనకు ప్రత్యేక ఆకర్షణ. కానీ పులిని చూడటమే సుందర్‌బన్ లక్ష్యం కాదు. పులి కనిపించకపోయినా పులి బతికే అడవిని కాపాడటం ముఖ్యం. అందుకే ఇక్కడ పులుల సంరక్షణకు ప్రత్యేక రక్షిత ప్రాంతం ఉంది. పర్యవేక్షణ, కెమెరా ఉచ్చులు, వేట నిరోధక చర్యలు, ఆవాస సంరక్షణ వంటి పద్ధతులతో పులుల కదలికలను అటవీ అధికారులు గమనిస్తున్నారు.

## సుందర్‌బన్‌కు అసలు హీరోలు.. మడ చెట్లు

సుందర్‌బన్ పేరులోనే 'సుందరి' చెట్టు జ్ఞాపకం ఉంటుంది. ఇక్కడి మడ అడవుల్లో సుందరి, కేవ్రా, గరాన్, బైన్ తదితర జాతుల చెట్లు కనిపిస్తాయి. ఉప్పునీటిని తట్టుకుని, నీటితో నిండిన నేలలో పెరిగే ఈ చెట్లు ప్రకృతి అద్భుతానికి నిదర్శనం. వాటి వేర్లు నీటిలోకి, మట్టిలోకి విస్తరించి ఉంటాయి. ఈ మడ అడవులు పర్యావరణానికి సహజ రక్షణ కవచంలా పనిచేస్తాయి. తుపాన్లు, సముద్రపు అలలు, తీరక్షయం వంటి వాటి ప్రభావాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అంతేకాదు.. చేపలు, రొయ్యలు, పీతలు, పక్షులు, సరీసృపాలు, అనేక సూక్ష్మజీవులకు మడ అడవులు ఆశ్రయం. అందుకే సుందర్‌బన్‌లో ఒక మడ చెట్టు నరికితే అది కేవలం ఒక చెట్టు నరికినట్టుకాదు. ఒక జీవవ్యవస్థకు దెబ్బ. తీరాన్ని కాపాడేందుకు అటవీశాఖ ప్రత్యేకంగా నారుమడిలా సుందరి చెట్లను పెంచుతోంది. ఇక, సుందర్‌బన్ చుట్టుపక్కల గ్రామాల్లో జీవితం నదితో ముడిపడి ఉంటుంది. ఉదయం పడవలో బయలుదేరిన మత్స్యకారుడు సాయంత్రానికి తిరిగి వస్తాడో లేదో చెప్పలేని పరిస్థితులు ఉంటాయి. పీతలు, చేపలు పట్టడం.. తేనె సేకరించడం.. చిన్నస్థాయి వ్యవసాయం.. పడవల ద్వారా పర్యాటకులను తీసుకెళ్లడం.. ఇలా ప్రకృతే వారి జీవనాధారం. కానీ అదే ప్రకృతి ఒక్కోసారి వారికి ప్రమాదంగా మారుతుంది. పులి దాడి.. పాముకాటు.. మొసళ్ల ప్రమాదం.. తుపాన్లు.. వరదలు.. ఉప్పునీటి ముంపు.. సుందర్‌బన్ ప్రజలకు ఇవి పుస్తకాల్లో చదివే విపత్తులు కాదు. రోజువారీ జీవితంలో ఎదురయ్యే వాస్తవాలు.




## అడవిలోకి వెళ్లే ముందు బోనోబిబి ప్రార్థన

సుందర్‌బన్ ప్రాంత ప్రజల జీవనంలో ప్రకృతి మాత్రమే కాదు.. ప్రకృతిపై ఆధారపడిన విశ్వాసాలూ బలంగా ఉన్నాయి. అడవిలోకి వెళ్లే ముందు బోనోబిబిని ప్రార్థించే సంప్రదాయం అనేక ప్రాంతాల్లో కనిపిస్తుంది. అడవిలోకి అడుగుపెట్టిన తర్వాత మనిషి తన శక్తి ఎంత పరిమితమో తెలుసుకుంటాడు. పులి ఎక్కడ ఉందో తెలియదు. నది ఎప్పుడు ఉప్పొంగుతుందో తెలియదు. తుపాను ఎప్పుడు వస్తుందో తెలియదు. అందుకే అడవిని దేవతగా భావించి, రక్షణ కోసం ప్రార్థించడం స్థానిక సంస్కృతిలో భాగమైంది. ఇది కేవలం మత విశ్వాసంగా చూడాల్సిన విషయం కాదు. ప్రకృతిని గౌరవించే స్థానిక జీవన సంస్కృతికి ప్రతిబింబంగా కూడా చూడవచ్చు.



## తేనె కోసం ప్రాణాలను పణంగా పెట్టే మౌలీలు

సుందర్‌బన్ అడవుల్లో తేనె సేకరణకు ప్రత్యేక చరిత్ర ఉంది. స్థానికంగా తేనె సేకరించే వారిని మౌలీలు అంటారు. తేనె కోసం అడవిలోకి వెళ్లడం అంటే సాధారణంగా చెట్టు ఎక్కి తేనెపట్టు తీసుకురావడం కాదు. పులుల సంచారం ఉండే ప్రాంతాల్లోకి వెళ్లాలి. అడవి పరిస్థితులు తెలుసుకోవాలి. నదులు, కాలువలు దాటాలి. తేనెటీగల గూళ్లను గుర్తించాలి. అందుకే ప్రతి తేనె సీసా వెనుక ఒక జీవన పోరాటం ఉంటుంది. పులి దాడుల భయం ఉన్నప్పటికీ కుటుంబం కోసం అడవిలోకి వెళ్లే పరిస్థితి కొందరికి తప్పనిసరి. ఇటీవలి కాలంలో ఇలాంటి ప్రమాదకర జీవనోపాధులకు ప్రత్యామ్నాయాలను కల్పించేందుకు మహిళల స్వయం ఉపాధి, తేనెటీగల పెంపకం, పర్యాటక ఆధారిత ఉపాధి వంటి మార్గాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది.

## పడవలో మొదలయ్యే సఫారీ

ఎక్కడైనా సఫారీ అంటే కంచె వేసిన జీప్‌లో కూర్చొని, కెమెరా పట్టి ఫొటోలు తీయడం లాంటిదే. కానీ, సుందర్‌బన్‌లో సఫారీ చేయాలంటే పడవ ఎక్కాల్సిందే. నది మీద పడవ నెమ్మదిగా ముందుకు సాగుతుంటే నగర జీవితానికి పూర్తిగా భిన్నమైన ప్రపంచం కళ్లముందు ఆవిష్కృతమవుతుంది. నీటికి ఇరువైపులా మడ అడవులు. ఎక్కడో ఒకచోట చెట్ల కొమ్మలపై పక్షులు. మరెక్కడో బురదలో కదులుతున్న పీతలు. నీటి అంచున మొసలి కనిపిస్తుందేమోనన్న ఆసక్తి. మధ్యమధ్యలో పడవ ఇంజిన్ శబ్దం కూడా తగ్గిపోతుంది. ఆ నిశ్శబ్దంలో అడవిని చూస్తుంటే మనిషి ఎంత చిన్నవాడో అర్థమవుతుంది. అడవిలో ఏ క్షణంలో ఏ జంతువు బయటకు వస్తుందో తెలియదు. అందుకే సుందర్‌బన్ సఫారీలో ఉత్సాహంతో పాటు ఒకింత ఉత్కంఠ కూడా ఉంటుంది.



## పర్యాటకం.. ఉపాధికి కొత్త దారి

సుందర్‌బన్‌లో పర్యాటకం పెరగడం స్థానికులకు ఉపాధి అవకాశాలను కూడా తీసుకొస్తోంది. పడవల నిర్వహణ నుంచి పర్యాటకులకు మార్గదర్శకత్వం వరకు.. వసతి గృహాల నుంచి స్థానిక ఆహార పదార్థాల విక్రయం వరకు.. అనేక రంగాల్లో స్థానికులకు అవకాశాలు లభిస్తున్నాయి. అయితే పర్యాటకం అడవికి భారంగా మారకూడదు. పర్యాటకుడు ప్లాస్టిక్‌ను నీటిలో పడేస్తే అది నదిలో కలుస్తుంది. అడవి జంతువులకు ఆహారం వేస్తే వాటి సహజ ప్రవర్తన మారవచ్చు. పులిని దగ్గరగా చూడాలనే ఆత్రుతతో నిబంధనలు ఉల్లంఘిస్తే వన్యప్రాణులకు, మనుషులకు ప్రమాదం. అందుకే సుందర్‌బన్‌కు అవసరమైనది సాధారణ పర్యాటకం కాదు.. పర్యావరణ హిత పర్యాటకం. ప్రకృతిని ఆస్వాదిస్తూ.. దానికి హాని చేయకుండా.. స్థానికులకు ఆదాయం కల్పిస్తూ.. వన్యప్రాణుల ఆవాసాన్ని కాపాడే పర్యాటకం.





పడవ తిరుగు ప్రయాణం మొదలవుతుంది.
సూర్యుడు నెమ్మదిగా అస్తమించడానికి సిద్ధమవుతున్నాడు.
మడ చెట్ల నీడ నీటిపై పడుతోంది.
ఎక్కడో దూరంగా పక్షుల కిలకిల.
పడవ ఇంజిన్ శబ్దం.
మళ్లీ మనిషి ప్రపంచంలోకి అడుగు.
ఈ ప్రయాణంలో పులి కనిపించకపోవచ్చు.
కానీ సుందర్‌బన్ మనకు
కనిపించని ఒక పెద్ద సత్యాన్ని చూపిస్తుంది.
పులి బతకాలంటే అడవి బతకాలి.
అడవి బతకాలంటే నది బతకాలి.
నది బతకాలంటే మడ అడవులు బతకాలి.
మడ అడవులు బతకాలంటే అక్కడి ప్రజలు బతకాలి.
అందుకే సుందర్‌బన్ కేవలం వన్యప్రాణి సంరక్షణ కాదు.
అది ఒక సంపూర్ణ జీవవ్యవస్థను కాపాడే ప్రయత్నం.
ఒక పర్యాటకుడికి సుందర్‌బన్ ఒక అందమైన ప్రయాణం కావచ్చు.
ఒక ఫొటోగ్రాఫర్‌కు అది అరుదైన దృశ్యాల ప్రపంచం కావచ్చు.
ఒక వన్యప్రాణి ప్రేమికుడికి అది రాయల్ బెంగాల్ టైగర్ ఆవాసం కావచ్చు.. కానీ అక్కడి ప్రజలకు?
అది వారి ఇల్లు. వారి అడవి. వారి నది. వారి బతుకు.

అందుకే.. పోదాం పదండి.. సుందర వనాలకు!
పులిని చూడటానికి మాత్రమే కాదు..
పులి బతికే అడవిని అర్థం చేసుకోవడానికి.
మడ చెట్ల అందాన్ని ఆస్వాదించడానికి మాత్రమే కాదు..
ఆ చెట్లు మనల్ని ఎలా కాపాడుతున్నాయో తెలుసుకోవడానికి.
పడవ ప్రయాణాన్ని ఆస్వాదించడానికి మాత్రమే కాదు..
ఆ పడవలో జీవితం సాగిస్తున్న మనుషుల కథ వినడానికి.
సుందర్‌బన్‌ను చూసి తిరిగి రావడం కాదు..
సుందర్‌బన్‌ను మనతో తీసుకురావడం.

పీఐబీ హైదరాబాద్, పీఐబీ కోల్‌కతా సహకారంతో..

ఒయ్యారి చిత్రం



# నన్ను దొంగను చేశారు



**సోదరి రాధపై నటి అంబిక ఫైర్**

ఒకప్పటి ప్రముఖ నటీమణులు, అక్కచెల్లెళ్లు అయిన అంబిక, రాధల మధ్య ఆస్తి వివాదం ముదిరింది. తనపై సోదరి రాధ చేసిన ఆరోపణలను అంబిక తీవ్రంగా ఖండించారు. తనను దొంగగా చిత్రీకరించడంపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ వ్యవహారాన్ని పోలీసుల వరకు తీసుకెళ్లడం తనను మానసిక వేదనకు గురిచేసిందని ఆమె పేర్కొన్నారు. దాదాపు రూ. 46 కోట్ల విలువైన చెక్కులను తాను, తన సోదరుడు మల్లికార్జున్ కాజేయాలని చూశామంటూ రాధ చెన్నై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంపై అంబిక స్పందించారు. ఈ ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని, తాను ఎటువంటి తప్పు చేయలేదని ఆమె స్పష్టం చేశారు. చిన్నతనం నుంచి కుటుంబం కోసం అహర్నిశలు శ్రమించానని, అటువంటి తనపై రాధ గదిలో నుంచి చెక్కులు దొంగిలించానని నిందలు వేయడం బాధాకరమని అన్నారు. రాధ తన వస్తువుల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటుందని, నంబర్ లాక్ ఉన్న బ్యాగులనే వాడుతుందని, అటువంటప్పుడు దొంగతనం జరగడం అసాధ్యమని అంబిక వెల్లడించారు. ఈ వివాదానికి మూలకారణం ఆస్తి గొడవలేనని అంబిక తెలిపారు. 'ఏఆర్ఎస్ గార్డెన్'ను తాను ఎంతో కష్టపడి సంపాదించిన సొమ్ముతో నిర్మించానని, దివంగత ఎంజీఆర్ ఆశీస్సులతో ఆ పేరు పెట్టానని ఆమె గుర్తుచేశారు. అయితే, ఆ పేరును 'ఆర్.ఆర్. గార్డెన్'గా మార్చి, తనకు రావాల్సిన వాటాను నిరాకరించడంతోనే న్యాయపోరాటం చేయాల్సి వచ్చిందని ఆమె వివరించారు. ఈ సమస్యను కుటుంబ సభ్యుల మధ్యే పరిష్కరించుకోవడానికి పలుమార్లు ప్రయత్నించినప్పటికీ, అవి ఫలించలేదని అంబిక పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున, న్యాయవ్యవస్థపై గౌరవంతో ఈ అంశంపై ఇకపై బహిరంగంగా మాట్లాడబోనని ఆమె స్పష్టం చేశారు.



# సావిత్రి శ్రీధరన్ కన్నుమూత

మలయాళ సినీ పరిశ్రమలో తీవ్ర శోకం నెలకొంది. ప్రముఖ సీనియర్ నటి, నాటకరంగ కళాకారిణి సావిత్రి శ్రీధరన్ కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోసహజ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల మలయాళ చిత్రసీమతో పాటు సినీ అభిమానులు, నాటకరంగ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. సావిత్రి శ్రీధరన్ నటనా జీవితాన్ని నాటకరంగం ద్వారా ప్రారంభించారు. నాటకాల్లో సహజసిద్ధమైన నటనతో, అద్భుతమైన సంభాషణల ఉచ్చారణతో వేదికపై ఎన్నో మరపురాని పాత్రలను పోషించి మంచి పేరు తెచ్చుకున్నారు. దశాబ్దాల పాటు నాటకరంగంలో సేవలు అందించి అనేక అవార్డులు , రివార్డులు నాటక ప్రేమికుల ప్రశంసలు అందుకున్నారు. నాటకరంగంలో ఎంతో అనుభవం సంపాదించిన తర్వాత సావిత్రి వెండితెరపై అడుగుపెట్టారు. 2018లో విడుదలైన –సుడాని ఫ్రమ్ నైజీరియా– చిత్రం ఆమె కెరీర్‌లో మైలురాయిగా నిలిచింది. ఈ సినిమాలో తల్లి పాత్రలో సావిత్రి శ్రీధరన్ కనబరిచిన నటన ప్రేక్షకులను, విమర్శకులను అమితంగా ఆకట్టుకుంది. –సుడాని ఫ్రమ్ నైజీరియా– చిత్రంలో చూపిన అత్యుత్తమ నటనకు గానూ ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ చిత్రానికి గానూ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో గౌరవప్రదమైన –స్పెషల్ మెన్షన్– సాధించడమే కాకుండా కేరళ రాష్ట్ర ఉత్తమ క్యారెక్టర్ నటి అవార్డును కూడా గెలుచుకున్నారు. సాధారణ నాటక వేదిక నుంచి ప్రారంభమై జాతీయ స్థాయి గుర్తింపు సాధించిన సావిత్రి ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం. అటుపై సావిత్రి –వైరస్– వంటి పలు ప్రముఖ మలయాళ చిత్రాల్లో విభిన్నమైన పాత్రలు పోషించి నటిగా ప్రత్యేక ముద్ర వేశారు. ఏ పాత్ర చేపట్టినా అందులో పరకాయ ప్రవేశం చేసి సహజత్వంతో జీవించడం ఆమె ప్రత్యేకాంశం. మాతృమూర్తి పాత్రలకు సావిత్రి తనదైన శైలిలో జీవాన్ని అందించారని సినీ ప్రముఖులు కొనియాడుతున్నారు.



# కూచిపూడితో మెప్పించిన డింపుల్..

టాలీవుడ్ అందాల భామ డింపుల్ హయాతి తిరుమలలోని నాద నీరాజనం వేదికపై అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి భక్తులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎరుపు, గోల్డ్ కలర్ సిల్క్ చీర కట్టి, సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో ఆమె ప్రదర్శించిన కూచిపూడి నాట్యం అందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల పవిత్ర సమయంలో డింపుల్ హయాతి నాద నీరాజనం వేదికపై కూచిపూడి నాట్యం చేయడం విశేషం. సంప్రదాయబద్ధమైన నృత్య భంగిమలు, చక్కటి ముఖకవళికలతో ఆమె చేసిన ప్రదర్శన భక్తులకు కనులవిందుగా నిలిచింది. ఇక నృత్య ప్రదర్శనకు ముందు రోజు ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఇన్నాళ్లూ సినిమాల్లో గ్లామరస్ పాత్రల్లో అలరించిన డింపుల్ హయాతిలో ఈ స్థాయి సంప్రదాయ నాట్య ప్రతిభ కూడా ఉందా అని నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఇక సోషల్ మీడియాలో ఆమె డ్యాన్స్ వీడియోలు చూసిన అభిమానులు "డింపుల్ గారు చాలా అందంగా, అద్భుతంగా నాట్యం చేశారు" .



# చచ్చిపోతా.. విషమివ్వండి:

కన్నడనాట సంచలనం సృష్టించిన రేణుకాస్వామి హత్య కేసులో ఏ1 నిందితురాలిగా ఉన్న నటి పవిత్ర గౌడ.. మంగళవారం జరిగిన బెయిల్ విచారణ సందర్భంగా కోర్టులో కన్నీరుమున్నీరైంది. పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన ఆమె "నాకు బెయిల్ మంజూరు చేయండి, లేదంటే చనిపోయేందుకు విషమైనా ఇవ్వండి" అంటూ న్యాయమూర్తిని వేడుకుంది. బెంగళూరులోని 59వ సీసీహెచ్ కోర్టులో జరిగిన ఈ విచారణలో.. జైలులో నైజీరియన్ మహిళలు తనను తీవ్రంగా వేధిస్తున్నారని పవిత్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె తరఫు న్యాయవాదులు మాట్లాడుతూ జైలులో పవిత్రను హత్య చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన సిట్ తరఫు న్యాయవాదులు కోర్టు ఆదేశాల మేరకు ఆమెను ఇప్పటికే వేరే బ్యారక్‌కు మార్చామని న్యాయస్థానానికి వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను వాయిదా వేశారు. గతంలో తాను ఉంటున్న బ్యారక్‌లో 30 మందితో కలిసి ఒకే టాయిలెట్ వాడాల్సి రావడం వల్ల అనారోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నానని పవిత్ర పిటిషన్ దాఖలు చేసింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు జైలు అధికారులు ఆమెను నలుగురైదుగురు మాత్రమే ఉన్న మరో బ్యారక్‌కు ఇటీవలే మార్చారు. తల్లి ఆరోగ్యం, కుమార్తె సంరక్షణ, తన సొంత ఆరోగ్య సమస్యలను కారణంగా చూపుతూ పవిత్ర గౌడ నాలుగోసారి బెయిల్ కోసం దరఖాస్తు చేసుకుంది. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి తనకు అసభ్యకర సందేశాలు పంపాడనే ఆరోపణలతో 2024 జూన్‌లో ఈ హత్య జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులో నటుడు దర్శన్ ఏ2 నిందితుడిగా ఉండగా, మొత్తం 17 మందిపై అభియోగాలు నమోదయ్యాయి. కేసులో సహ నిందితుడైన ప్రదోష్ ఎస్.రావు అప్రూవర్‌గా మారేందుకు కోర్టు ఇటీవల అనుమతించింది.



# నెగెటివ్ రోల్‌లో రష్మిక

రష్మిక మందన్న కెరీర్‌ను గమనిస్తే.. ఒక్కో సినిమాతో ఆమె తనను తాను కొత్తగా ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తోంది. స్టార్ హీరోల సరసన గ్లామర్, లవ్ ట్రాక్‌లకు మాత్రమే పరిమితం కాకుండా యాక్టింగ్ కు ప్రాధాన్యం ఉన్న పాత్రల వైపు కూడా ఆమె అడుగులు వేస్తోంది. ఇప్పుడు అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న రాకాలో ఆమె భాగం కానుందనే వార్తల నేపథ్యంలో మరో ఇంట్రెస్టింగ్ డిస్కషన్ మొదలైంది. ఈ సినిమాలో రష్మిక క్యారెక్టర్ ఇప్పటివరకు ఆమె చేసిన క్యారెక్టర్లకు పూర్తి భిన్నంగా ఉండొచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ క్యారెక్టర్ లో రెగ్యులర్ హీరోయిన్ షేడ్స్ కంటే కథకు ఉపయోగపడే స్ట్రాంగ్ యాంగిల్ ఉంటుందనే టాక్ ఆసక్తిని పెంచుతోంది. కొన్ని సీన్స్ లో నెగటివ్ టచ్ కనిపించినా.. దాన్ని పూర్తిస్థాయి నెగటివ్ క్యారెక్టర్‌గా చూడలేమనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. ఒక క్యారెక్టర్ ను మంచిదా, చెడ్డదా అనే రెండు కోణాల్లో కాకుండా.. కథలో దాని అవసరం ఏంటి అన్నది కీలకంగా మార్చడంలో అట్లీకి ప్రత్యేకమైన శైలి ఉంది. ల



# కయాదు అంటే.. హిరణ్యకశిపుడి భార్య

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ కయాదు లోహర్ ప్రస్తుతం నటించిన 'ప్యారడైజ్' సినిమా విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రమోషన్లలో బిజీగా ఉన్న ఆమె, తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన పేరు, కుటుంబ నేపథ్యం వెనుక ఉన్న ఆసక్తికరమైన కథను వెల్లడించారు. పురాణాల్లోని హిరణ్యకశిపుడి భార్య పేరు 'కయాదు' నుంచి తనకు ఈ పేరు పెట్టారని, తమ ఇంటిపేరు ఎలా మారిందో ఆమె చెప్పిన విశేషాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తన పేరు చాలా భిన్నంగా ఉండటానికి కారణమేంటో కయాదు లోహర్ ఈ ఇంటర్వ్యూలో వివరించారు. హిందూ పురాణాలలో రాక్షస రాజు హిరణ్యకశిపుడి భార్య పేరు కయాదు. ఆ పౌరాణిక పేరు నచ్చి, దాన్ని స్ఫూర్తిగా తీసుకుని తన తండ్రి తనకు 'కయాదు' అని నామకరణం చేశారని ఆమె తెలిపారు. ఇక తన పేరు వెనుక ఇంతటి ప్రత్యేకమైన పురాణ కథ ఉందనే విషయం చాలామందికి తెలియదని ఆమె చెప్పారు.

# చానుకు రజతం



## మీరాబాయి చానుకు చారిత్రక రజతం.. భారత్ ఖాతాలో మరో 3 పతకాలు

జపాన్‌లోని ఐచి-నగోయాలో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో నాలుగో రోజు భారత్‌కు చిరస్మరణీయంగా నిలిచింది. వెయిట్‌లిఫ్టింగ్ సూపర్ స్టార్ మీరాబాయి చాను మహిళల 49 కేజీల విభాగంలో చారిత్రక రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఆసియా క్రీడల్లో ఆమెకు ఇదే తొలి పతకం కావడం విశేషం. ఈ విజయంతో ఆమె కెరీర్‌లో మరో మైలురాయిని అందుకుంది. ఇదే రోజు మరో చారిత్రక విజయం కూడా నమోదైంది. సాఫ్ట్ టెన్నిస్‌లో జై మీనా కాంస్య పతకం సాధించి, ఈ క్రీడలో భారత్‌కు తొలి పతకాన్ని అందించాడు. సెమీఫైనల్ మ్యాచ్‌లో గాయపడటంతో అతను పోరాటాన్ని కొనసాగించలేకపోయినా, కాంస్యంతో దేశానికి గర్వకారణంగా నిలిచాడు. షూటింగ్ రేంజ్‌లోనూ భారత్ పతకాల వేట కొనసాగించింది. పురుషుల స్కీట్ టీమ్ (అనంత్‌జీత్ సింగ్ నరుకా, మైరాజ్ ఖాన్, భవ్‌తేఘ్ సింగ్ గిల్) కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అంతకుముందు మహిళల స్కీట్ జట్టు కూడా ఇదే విభాగంలో కాంస్యం సాధించింది. అయితే, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో డబుల్ ఒలింపిక్ పతక విజేత మను భాకర్‌కు నిరాశ ఎదురైంది. ఆమె పతకం లేకుండానే వెనుదిరిగింది. ప్రస్తుతం భారత్ ఒక స్వర్ణం, ఐదు రజతాలు, ఐదు కాంస్యాలతో కలిపి మొత్తం 11 పతకాలతో పట్టికలో 11వ స్థానంలో కొనసాగుతోంది.














# టీ20ల్లో నం.1గా అబ్రార్

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. అఫ్గానిస్థాన్ స్పిన్ సంచలనం రషీద్ ఖాన్ ఆరు నెలల సుదీర్ఘ ఆధిపత్యానికి తెరదించుతూ పాకిస్థాన్ లెగ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ తొలిసారి బౌలింగ్ చార్టులలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మరోవైపు, ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ బ్యాటింగ్ జాబితాలో కెరీర్ బెస్ట్ నాలుగో ర్యాంక్‌కు దూసుకొచ్చాడు. శ్రీలంకతో జరిగిన స్వదేశీ సిరీస్‌లో ఇంగ్లండ్ 3-0తో క్లీన్‌స్వీప్ చేయడంలో హ్యారీ బ్రూక్ కీలక పాత్ర పోషించాడు. ఈ సిరీస్‌లో మొత్తం 170 పరుగులు చేసిన అతను.. సౌతాంప్టన్‌లో అజేయంగా 114 పరుగులు సాధించి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డును గెలుచుకున్నాడు. ఈ ప్రదర్శనతో టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానానికి చేరాడు. భారత వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కాగా, టెస్టుల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న బ్రూక్.. వన్డే ర్యాంకింగ్స్‌లోనూ 12వ స్థానానికి చేరి, మూడు ఫార్మాట్లలోనూ టాప్-10లోకి ప్రవేశించేందుకు చేరువయ్యాడు. బౌలింగ్ విభాగంలో అనూహ్య మార్పు జరిగింది. ఇటీవల భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో రషీద్ ఖాన్ సాధారణ ప్రదర్శన చేయడంతో అతని రేటింగ్ ఒక పాయింట్ తగ్గింది. దీంతో 736 రేటింగ్ పాయింట్లతో ఉన్న పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్.. రషీద్‌ను వెనక్కి నెట్టి కెరీర్‌లో తొలిసారి నంబర్ వన్ టీ20 బౌలర్‌గా అవతరించాడు. ఉమర్ గుల్, సయీద్ అజ్మల్, ఇమాద్ వసీం, షాహిద్ అఫ్రిది తర్వాత ఈ ఘనత సాధించిన ఐదో పాకిస్థాన్ బౌలర్‌గా అబ్రార్ నిలిచాడు. ఇతర ఆటగాళ్లలో, శ్రీలంకపై 172 పరుగులు చేసిన ఇంగ్లండ్ వికెట్ కీపర్ జోస్ బట్లర్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఐదో ర్యాంక్‌కు చేరాడు. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఏడు స్థానాలు ఎగబాకి 22వ ర్యాంకును




అందుకున్నాడు. బౌలింగ్ జాబితాలో ఇంగ్లండ్ పేసర్ జేమీ ఓవర్టన్ ఏకంగా 47 స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంకుకు చేరుకోగా, భారత స్పిన్నర్లు అక్షర్ పటేల్ (15వ ర్యాంక్), రవి బిష్ణోయ్ (35వ ర్యాంక్) కూడా తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు. వన్డే ర్యాంకింగ్స్‌లో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా ఆస్ట్రేలియాపై రాణించి బ్యాటింగ్ జాబితాలో 24వ స్థానానికి, ఆసీస్ పేసర్ నాథన్ ఎల్లిస్ బౌలింగ్ జాబితాలో 17వ స్థానానికి చేరుకున్నారు.



# బౌన్సీ పిచ్‌లు వైభవ్‌కు అసలైన పరీక్ష

న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అసలు పరీక్ష ఎదురుకానుందా? బౌన్సీ పిచ్‌లపై అతడి బ్యాటింగ్‌ను చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు న్యూజిలాండ్ ప్రధాన కోచ్ రాబ్ వాల్టర్ తెలిపాడు. అంతేకాదు.. ఓ కోచ్‌గా వైభవ్‌ను కాస్త ఒత్తిడిలో చూసి, అలాంటి పరిస్థితులను అతడు ఎలా ఎదుర్కొంటాడో తెలుసుకోవాలని రహస్యంగా కోరుకుంటున్నానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ 2025, 2026 సీజన్లలో విధ్వంసక బ్యాటింగ్‌తో వైభవ్ ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది అండర్-19 ప్రపంచకప్‌లోనూ సత్తా చాటాడు. దాంతో జులైలో ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో టీ20ల్లో అరంగేట్రం చేశాడు. అయితే అఫ్ఘనిస్థాన్‌తో మూడు టీ20లు, జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడికి చోటు దక్కలేదు. అక్టోబర్ 22 నుంచి న్యూజిలాండ్‌తో భారత్ ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లో వైభవ్‌కు అవకాశం వస్తే.. న్యూజిలాండ్ సీమ్ అనుకూల పరిస్థితుల్లో అతడి ఆటకు గట్టి పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది. "బౌన్సీ వికెట్లపై వేగంగా వచ్చే బంతులను వైభవ్ ఎలా ఎదుర్కొంటాడో చూడాలని ఉంది. ఐపీఎల్‌లో ప్రపంచ స్థాయి బౌలర్లపై అతడు ఆధిపత్యం చెలాయించడం చూశాం. ఇప్పుడు భిన్నమైన పరిస్థితుల్లో అది ఎలా మారుతుందో చూడాలి.

# మానసిక దృఢత్వమే కీలకం

ఆస్ట్రేలియా జట్టులోని అనుభవజ్ఞులైన బౌలింగ్ దాడిని ఎదుర్కోవాలంటే భారత యువ బ్యాటర్లకు నైపుణ్యంతో పాటు మానసిక దృఢత్వం ఎంతో అవసరమని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఒత్తిడిని ఎంతగా తట్టుకోగలిగితే అంత మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని చెప్పాడు. 2027 జనవరి 21 నుంచి మార్చి 3 వరకు భారత్-ఆస్ట్రేలియా మధ్య ఐదు టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ జరగనుంది. పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, నాథన్ లియాన్ లాంటి బౌలర్లతో కూడిన ఆస్ట్రేలియా బౌలింగ్ విభాగం భారత యువ బ్యాటర్లకు గట్టి పరీక్ష పెట్టనుందని గంభీర్ పేర్కొన్నాడు. నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్ వేదికలుగా టెస్టులు జరగనున్నాయి. "టెస్టుల్లో నైపుణ్యం ముఖ్యం. కానీ మానసికంగా ఎంత బలంగా ఉన్నాం? ఒత్తిడిని ఎంతగా భరించగలం? అన్నదే కీలకం. ఒత్తిడిని స్వీకరించి ముందుకు వెళ్లగలిగితే అవకాశాలు మెరుగవుతాయి" అని గంభీర్ అన్నాడు. కఠిన సిరీస్‌లకు ముందస్తు ప్రణాళికతో సిద్ధమైతే ఫలితాలు స్పష్టంగా కనిపిస్తాయని గంభీర్ చెప్పాడు. శ్రీలంక పర్యటనను ఇందుకు ఉదాహరణగా చూపాడు. అక్కడ టెస్టులకు పది రోజుల ముందే చేరుకుని స్పిన్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా సాధన చేశామని తెలిపాడు. శ్రీలంకతో ఆడిన రెండు టెస్టుల్లోనూ భారత్ ఇన్నింగ్స్‌కు 400కు పైగా పరుగులు సాధించిందని గుర్తుచేశాడు. అక్కడి పరిస్థితుల్లో అనుభవజ్ఞులైన స్పిన్నర్లను ఎదుర్కొని ఈ స్థాయిలో పరుగులు చేయడం ముందస్తు సన్నాహాల ఫలితమేనన్నాడు. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియాతో టీ20లు ఆడిన తర్వాత కేవలం రెండు రోజుల వ్యవధిలోనే టెస్టు మ్యాచ్‌కు సిద్ధమయ్యామని గంభీర్ చెప్పాడు. వెస్టిండీస్‌తో సిరీస్‌కు ముందు కూడా ఆసియా కప్ ముగించుకుని రెండు ప్రాక్టీస్ సెషన్లతోనే టెస్టులోకి వెళ్లామని తెలిపాడు. అందుకే న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లకు తగినంత ముందుగా సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నాడు. ముఖ్యంగా స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోవడంపై దృష్టి పెట్టాలని చెప్పాడు.




# రో-కో ప్రపంచకప్ ఆడాలి

విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్ తరఫున ఆడాలని దేశం మొత్తం కోరుకుంటోందని టీమిండియా బ్యాటర్ రింకూ సింగ్ అన్నాడు. ఇద్దరూ దిగ్గజ ఆటగాళ్లని పేర్కొన్న అతడు.. 2027 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిస్తే అది దేశానికే కాకుండా కోహ్లి, రోహిత్‌కు కూడా ఎంతో ప్రత్యేకమైన సందర్భమవుతుందని చెప్పాడు. "విరాట్ భయ్యా, రోహిత్ భయ్యా ఇద్దరూ లెజెండ్స్. వాళ్లు




ప్రపంచకప్‌లో ఆడాలని నా ఒక్కడి కోరిక కాదు.. దేశం మొత్తం కోరుకుంటోంది. వాళ్లు జట్టులో ఉండి భారత్‌ను ప్రపంచకప్ విజేతగా నిలిపితే ఎంతో గొప్పగా ఉంటుంది. అది వాళ్లకు చివరి ప్రపంచకప్ కావచ్చేమో. 2011 తర్వాత భారత్ వన్డే ప్రపంచకప్ గెలవలేదు. అందుకే వాళ్లిద్దరూ జట్టుతో ఉండి ట్రోఫీ గెలిస్తే ఎంతో ప్రత్యేకం" అని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రింకూ చెప్పాడు. ఐపీఎల్ 2023లో గుజరాత్ టైటాన్స్‌పై వరుసగా ఐదు సిక్సర్లు బాదడంతో రింకూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే తనను కేవలం ఆ ఐదు సిక్సర్లతోనే గుర్తించకూడదని అతడు అంటున్నాడు. భారత్ తరఫున ప్రపంచకప్ గెలవడంలో భాగస్వామి కావడమే ప్రస్తుతం తన ప్రధాన లక్ష్యమని చెప్పాడు. బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడుతూ మరిన్ని ప్రపంచకప్ విజయాల్లో భాగం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. ఇక తాను కేవలం టీ20 ఆటగాడిననే అభిప్రాయాన్ని కూడా రింకూ ఖండించాడు. దేశవాళీ క్రికెట్‌లో వన్డేలు, నాలుగు రోజుల మ్యాచుల్లోనూ ఆడుతున్నానని చెప్పాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# సేవే లక్ష్యం.. సమాజమే పాఠశాల

జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విద్యార్థులను కేవలం పట్టాలు పొందిన వ్యక్తులుగా కాకుండా.. సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గొప్ప వేదిక. విద్య అంటే కేవలం పుస్తకాల్లోని అక్షరాలను నేర్చుకోవడం కాదు. మన చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకోవడం.. సమస్యలను గుర్తించడం.. వాటి పరిష్కారానికి మన వంతు కృషి చేయడం కూడా విద్యలో భాగమే. ఈ ఆలోచనతోనే భారతదేశంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భవించింది. విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశం.'నాట్ మీ బట్ యూ' అనే ఎన్ఎస్ఎస్ నినాదం వెనుక ఉన్న స్ఫూర్తి ఎంతో గొప్పది. 'నేను' కంటే 'మన సమాజం' ముఖ్యం అనే ఆలోచనను విద్యార్థుల్లో నాటడం ఈ పథకం అసలు లక్ష్యం. కానీ నేడు ఆ లక్ష్యం ఎంతవరకు నెరవేరుతోంది అన్నది ఆలోచించాల్సిన సమయం వచ్చింది.ఎన్ఎస్ఎస్ శిబిరాలు నిర్వహించడం, మొక్కలు నాటడం, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు అవసరమే. అయితే సేవా పథకం కేవలం కొన్ని రోజుల శిబిరాలకు, ఫొటోలకు, ధ్రువపత్రాలకు పరిమితం కాకూడదు. ఒక గ్రామంలో శిబిరం నిర్వహించి వెళ్లిపోవడం కంటే.. ఆ గ్రామంలోని ఒక సమస్యను గుర్తించి దాని పరిష్కారానికి నిరంతరంగా కృషి చేయడం ఎన్ఎస్ఎస్ అసలు స్ఫూర్తికి దగ్గరగా ఉంటుంది.గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, పాఠశాలల్లో మౌలిక వసతులు, నిరక్షరాస్యత, బాలికల విద్య, పర్యావరణ పరిరక్షణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, రహదారి భద్రత, సైబర్ మోసాలపై అవగాహన వంటి ఎన్నో సమస్యలు ఉన్నాయి. పట్టణాల్లోనూ చెత్త నిర్వహణ, వృద్ధుల సంరక్షణ, ప్రజారోగ్య అవగాహన, రక్తదాతల సమన్వయం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి రంగాల్లో విద్యార్థుల సేవలకు విస్తృత అవకాశాలున్నాయి.ముఖ్యంగా నేటి తరం విద్యార్థులు సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం గడుపుతున్న పరిస్థితుల్లో.. వారి శక్తిని సమాజ నిర్మాణం వైపు మళ్లించాల్సిన అవసరం ఉంది. ఎన్ఎస్ఎస్ ద్వారా ఒక విద్యార్థి ఒక గ్రామాన్ని దత్తత తీసుకున్నా.. ఒక పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులకు బోధించినా.. ఒక కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించినా.. అది నిజమైన సామాజిక సేవే.అయితే ఇందుకు విద్యాసంస్థలు కూడా బాధ్యత వహించాలి. ఎన్ఎస్ఎస్ను కేవలం హాజరు, ధ్రువపత్రాలు, కార్యక్రమాల సంఖ్యతో కొలవడం సరికాదు. ఒక విద్యార్థి ఎంతమంది మొక్కలు నాటాడన్నదానికంటే.. వాటిలో ఎన్ని బతికాయి? ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నదానికంటే.. దాని వల్ల ఎంతమందిలో మార్పు వచ్చింది? ఒక గ్రామంలో శిబిరం నిర్వహించామన్నదానికంటే.. అక్కడ ఏ సమస్య పరిష్కారమైంది? అనే ప్రశ్నలు ముఖ్యంగా మారాలి.ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు శిక్షణ కూడా కాలానుగుణంగా మారాలి. ప్రథమ చికిత్స, విపత్తుల నిర్వహణ, డిజిటల్ భద్రత, సైబర్ మోసాలపై అవగాహన, పర్యావరణ పరిరక్షణ, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య బాధ్యతలు వంటి అంశాలను సేవా కార్యక్రమాలతో అనుసంధానం చేయాలి. అప్పుడు ఎన్ఎస్ఎస్ ఒక కార్యక్రమం కాకుండా.. ఒక పౌరస్ఫూర్తి ఉద్యమంగా మారుతుంది.దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే తయారవుతుంది. కానీ మంచి పౌరుడు పుస్తకాల మధ్య మాత్రమే తయారు కాడు. సమాజంలోకి వెళ్లినప్పుడు.. పేదరికాన్ని చూసినప్పుడు.. వెనుకబడినవారి బాధను అర్థం చేసుకున్నప్పుడు.. ప్రకృతి విధ్వంసాన్ని గమనించినప్పుడు.. తనకున్న జ్ఞానాన్ని ఇతరుల కోసం ఉపయోగించినప్పుడు నిజమైన పౌరస్ఫూర్తి పుడుతుంది.అందుకే ఎన్ఎస్ఎస్ను కేవలం 'విద్యార్థుల సేవా కార్యక్రమం'గా చూడకూడదు. దేశాన్ని నిర్మించే పౌరులను తీర్చిదిద్దే సామాజిక పాఠశాలగా చూడాలి.సేవ చేయడానికి పెద్ద పదవి అవసరం లేదు. పెద్ద సంపద అవసరం లేదు. ముందుగా కావాల్సింది బాధ్యత. ఆ బాధ్యతను విద్యార్థుల్లో పెంచగలిగితే.. ఎన్ఎస్ఎస్ లక్ష్యం సార్థకమవుతుంది.

# గుర్తులు చిన్నవే.. అర్థాలు పెద్దవి



మన జీవితంలో కొన్ని రోజులు వస్తుంటాయి. ఎందుకు వస్తాయో తెలియకపోయినా.. క్యాలెండర్లో మాత్రం తమకంటూ ఒక స్థానం సంపాదించుకుంటాయి. అలాంటి రోజుల్లో 'జాతీయ విరామచిహ్నాల దినోత్సవం' కూడా ఒకటి. వాక్యాలను అందంగా పేర్చే చుక్క, కామా, ప్రశ్నార్థకం, ఆశ్చర్యార్థకం, ద్విబిందువు, అర్ధవిరామం వంటి చిన్న చిన్న గుర్తులకు కూడా ఒక రోజు ఉండటం విశేషమే! నిజానికి విరామచిహ్నాలు లేకపోతే భాషకు ఊపిరి ఉండదు. మాట ఎక్కడ ఆగాలి? ఎక్కడ ప్రశ్నించాలి? ఎక్కడ ఆశ్చర్యపడాలి? ఎక్కడ భావాన్ని బలంగా చెప్పాలి? అన్నది విరామచిహ్నాలే నిర్ణయిస్తాయి.

ఒక చిన్న కామా కూడా వాక్యం మొత్తానికి అర్థాన్ని మార్చేయగలదు. ఒక ప్రశ్నార్థకం మన ఆలోచనలను కదిలిస్తుంది. ఒక ఆశ్చర్యార్థకం మన భావోద్వేగాన్ని బయటపెడుతుంది. చివర్లో పడే చుక్క మాత్రం.. 'ఇంతే!' అని తేల్చేస్తుంది. అందుకే ఈ రోజు ఒక సరదా ప్రశ్న వేసుకోవాలి. మన జీవితంలో కూడా విరామచిహ్నాలు ఉంటే ఎలా ఉంటుంది? ఎప్పుడూ పరుగే. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఫోన్, పని, వార్తలు, సామాజిక మాధ్యమాలు, సమావేశాలు, ప్రయాణాలు.. ఒక్క క్షణం కూడా మనకు మనమే 'కామా' పెట్టుకోం. ఎక్కడ ఆగాలో తెలియదు. ఎక్కడ ప్రశ్నించాలో ఆలోచించం. ఎక్కడ ఆశ్చర్యపడాలో కూడా మరిచిపోతున్నాం.

కామా చెప్పేది – కొద్దిసేపు ఆగు.

ప్రశ్నార్థకం చెప్పేది – ఎందుకు? అని అడుగు.

ఆశ్చర్యార్థకం చెప్పేది – ఇదిగో! జీవితంలో ఇంకా ఆశ్చర్యాలు ఉన్నాయి.

చుక్క చెప్పేది – ఏదో ఒక దశకు ముగింపు పెట్టు.

అర్ధవిరామం చెప్పేది – ఇది ముగింపు కాదు.. ఇంకో భాగం ఉంది.

ఇవన్నీ మన జీవితానికీ వర్తించే పాఠాలే.

ముఖ్యంగా నేటి సమాచార యుగంలో విరామచిహ్నాల ప్రాధాన్యం మరింత పెరిగింది. ఒక సందేశాన్ని తొందరగా పంపితే అర్థం మారిపోవచ్చు. ఒక ప్రశ్నార్థకం లేకపోతే ప్రశ్న ప్రకటనగా మారవచ్చు. ఒక ఆశ్చర్యార్థకం ఎక్కువైతే సాధారణ మాట కూడా ఆగ్రహంగా కనిపించవచ్చు. సామాజిక మాధ్యమాల్లో అయితే ఒక్క గుర్తే సంబంధాలను కూడా మార్చేసే స్థాయికి చేరింది.ఇక జర్నలిజంలో విరామచిహ్నాలకు మరింత బాధ్యత ఉంది. వార్తలో ఒక కామా తప్పు చోట పడినా అర్థం మారుతుంది. శీర్షికలో ఒక పదం తప్పుగా విరామచిహ్నంతో ముగిసినా భావం వేరుగా వెళ్లొచ్చు. వార్త అంటే కేవలం సమాచారం కాదు.. స్పష్టత కూడా. అందుకే పాత్రికేయ భాషలో విరామచిహ్నాలు అలంకారం కాదు.. అర్థానికి కాపలాదారులు.అయితే మన సమాజంలో ఇప్పుడు మరో రకమైన సమస్య కనిపిస్తోంది. ప్రశ్నార్థకాలు తగ్గిపోతున్నాయి. ఎవరు ఏది చెప్పినా వెంటనే నమ్మేస్తున్నాం. 'ఎందుకు?' అనే ప్రశ్న అడగడానికి బదులు 'నిజమే కదా!' అని ముందే నిర్ణయించుకుంటున్నాం. ఆశ్చర్యార్థకాలు మాత్రం పెరిగిపోతున్నాయి. ప్రతి చిన్న విషయానికీ సంచలనం! ప్రతి వాదనకీ ఉత్కంఠ! ప్రతి సమాచారానికీ అత్యవసరం!అందుకే ఈ 'విరామచిహ్నాల దినోత్సవం' మనకు చిన్న భాషా పాఠంతో పాటు పెద్ద జీవిత పాఠాన్ని కూడా చెబుతోంది.

ఎక్కడ ఆగాలో తెలుసుకోవాలి.ఎక్కడ ప్రశ్నించాలో తెలుసుకోవాలి.ఎక్కడ ఆశ్చర్యపడాలో తెలుసుకోవాలి.ఎక్కడ ముగించాలో తెలుసుకోవాలి. అన్నింటికంటే ముఖ్యంగా.. జీవితంలో సరైన చోట 'విరామం' పెట్టడం నేర్చుకోవాలి.అందుకే ఆశ్చర్యపోవాల్సిందే..ఆశ్చర్యార్థకానికీ ఉందో రోజు! కానీ అంతకంటే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మనిషికి మాత్రం 'ఆగు!' అని చెప్పే రోజు ఇంకా అవసరమే.

**– శశిధర్ అక్కెల**



# సాగరం దాటే వాణిజ్యం!

ప్రపంచ వాణిజ్యానికి సముద్రాలే జీవనాడి.. కానీ సముద్రాల భవిష్యత్తు మాత్రం మానవ నిర్లక్ష్యంతో ప్రశ్నార్థకంగా మారుతోంది! భూమిపై మనకు కనిపించేది భూభాగం. కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించేది చాలావరకు కనిపించని సముద్ర మార్గాలే. దేశాల మధ్య వస్తువుల రవాణా నుంచి ఇంధనం, ముడిసరుకు, ఆహార ఉత్పత్తులు, పారిశ్రామిక పరికరాల వరకు అంతర్జాతీయ వాణిజ్యంలో సముద్ర రవాణా కీలక పాత్ర పోషిస్తోంది. అందుకే సముద్రయానం అంటే కేవలం ఓడలు ప్రయాణించే మార్గం కాదు.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు జీవనాడి. ప్రతి ఏడాది సెప్టెంబర్ చివరి గురువారం జరుపుకునే ప్రపంచ సముద్రయాన దినోత్సవం ఈ రంగం ప్రాధాన్యాన్ని గుర్తుచేయడంతో పాటు.. సముద్రాల భద్రత, నౌకాయాన ప్రమాణాలు, సముద్ర పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుంది.

ఒక నౌక సముద్రంలో ప్రయాణించడం వెనుక వేలాది మంది శ్రమ ఉంటుంది. నావికులు, ఇంజినీర్లు, ఓడ నిర్మాణ కార్మికులు, ఓడరేవు సిబ్బంది, సరకు నిర్వహణ సిబ్బంది.. ఇలా అనేక వర్గాల కృషి ప్రపంచ వాణిజ్యాన్ని నడిపిస్తుంది. కానీ వారి శ్రమ మన కళ్లకు కనిపించదు. ఒక దేశం నుంచి మరో దేశానికి వస్తువులు చేరినప్పుడు ధర గురించి మాట్లాడతాం.. కానీ ఆ వస్తువు సముద్రాన్ని దాటి మన దగ్గరకు చేరే ప్రక్రియ గురించి మాత్రం పెద్దగా ఆలోచించం. ముఖ్యంగా భారతదేశం వంటి విస్తారమైన తీరరేఖ కలిగిన దేశానికి సముద్ర రంగం వ్యూహాత్మకంగానూ, ఆర్థికంగానూ అత్యంత కీలకం. ఓడరేవుల అభివృద్ధి, నౌక నిర్మాణం, నౌక మరమ్మతులు, తీర ప్రాంత పరిశ్రమలు, సముద్ర రవాణా, సముద్ర ఆధారిత ఉపాధి.. ఇవన్నీ దేశ ఆర్థికాభివృద్ధితో ముడిపడి ఉన్నాయి. ఇటీవలి కాలంలో మరో మార్పు కూడా స్పష్టంగా కనిపిస్తోంది. కృత్రిమ మేధ, ఆటోమేషన్, డిజిటల్ నావిగేషన్ వంటి సాంకేతికతలు నౌకాయాన రంగంలోకి వేగంగా ప్రవేశిస్తున్నాయి. భవిష్యత్తులో మరింత స్వయంచాలక నౌకలు, తెలివైన ఓడరేవులు, డిజిటల్ సరకు నిర్వహణ వ్యవస్థలు రావచ్చు. సాంకేతికత సామర్థ్యాన్ని పెంచినా.. మానవ నైపుణ్యం, భద్రతా ప్రమాణాలు, సైబర్ భద్రత వంటి అంశాలను నిర్లక్ష్యం చేస్తే కొత్త ప్రమాదాలు కూడా తలెత్తవచ్చు. అన్నింటికంటే పెద్ద ప్రశ్న సముద్ర పర్యావరణ పరిరక్షణ. సముద్రాల్లోకి చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చమురు కాలుష్యం, రసాయన వ్యర్థాలు, అధిక మత్స్య వేట, సముద్ర ఉష్ణోగ్రతల్లో మార్పులు.. ఇవన్నీ సముద్ర జీవావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సముద్రాన్ని వాణిజ్య మార్గంగా మాత్రమే చూస్తే.. భవిష్యత్ తరాలకు మనం ఏ సముద్రాన్ని అందిస్తాం? వాతావరణ మార్పుల నేపథ్యంలో సముద్ర మట్టాల పెరుగుదల తీర ప్రాంతాలకు సవాలుగా మారుతోంది. తీర ప్రాంత ప్రజల జీవనోపాధి, మత్స్యకారుల భద్రత, తీర పర్యావరణ వ్యవస్థల రక్షణ.. ఇవన్నీ సముద్ర విధానాల్లో భాగం కావాలి.

సముద్రం నుంచి లాభాలు పొందే ప్రతి దేశం.. సముద్రానికి తిరిగి తన బాధ్యతను చెల్లించాలి. మరో ముఖ్యమైన అంశం నావికుల సంక్షేమం. నెలల తరబడి సముద్రంలో ప్రయాణిస్తూ కుటుంబాలకు దూరంగా పనిచేసే నావికుల మానసిక, శారీరక సంక్షేమం, పని పరిస్థితులు, భద్రత, అత్యవసర సేవలు కూడా అంతే ముఖ్యమైనవి. ఓడ సురక్షితంగా ఉండటం ఎంత అవసరమో.. దానిని నడిపించే మనిషి సురక్షితంగా ఉండటం అంతే అవసరం. ప్రపంచ సముద్రయాన దినోత్సవం అందుకే ఒక ఉత్సవం మాత్రమే కాకుండా ఒక హెచ్చరిక కూడా. సముద్రం మనకు మార్గం ఇస్తోంది.. మనం దానికి రక్షణ ఇవ్వాలి. సముద్రం మన వాణిజ్యాన్ని మోస్తోంది.. మనం దాని భవిష్యత్తును మోయాలి. సముద్రం సంపదను ఇస్తోంది.. మనం దాని జీవ వైవిధ్యాన్ని కాపాడాలి. ఓడలు మరింత వేగంగా ప్రయాణించాలి. ఓడరేవులు మరింత ఆధునికంగా మారాలి. సముద్ర వాణిజ్యం మరింత విస్తరించాలి. కానీ అదే సమయంలో సముద్రం మరింత పరిశుభ్రంగా, సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండాలి. ఎందుకంటే.. సముద్రం ఆగిపోతే వాణిజ్యం ఆగుతుంది. సముద్రం కలుషితమైతే జీవితం దెబ్బతింటుంది. సముద్రం బలహీనమైతే తీర ప్రాంత భవిష్యత్తే ప్రమాదంలో పడుతుంది. అందుకే సముద్రయాన దినోత్సవం నాడు నౌకలను మాత్రమే కాదు.. సముద్రాన్ని కూడా గుర్తు చేసుకోవాలి. సాగరాన్ని ఉపయోగించుకోవడం అభివృద్ధి కావచ్చు.. సాగరాన్ని కాపాడుకోవడమే నిజమైన ప్రగతి.

**– రామస్వామి చింత, మహబూబ్‌నగర్**

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.